# పుస్తకపరిచయాలు

## 2013, 2014



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 119

# కౌముది లో 2013–2014 సంచికలలో

# ప్రచురితమైన పుస్తకపరిచయాలు


| పుస్తకం పేరు | రచyiత(త్రి) | పేజి |
|---|---|---|
| ఆ అరగంట చాలు | కస్తూరి మురళీకృష్ణ | 4 |
| యాత్ర దీపిక | పి ఎస్ యమ్ లక్ష్మి | 5 |
| అమెరికా వంటింటి పద్యాలు | సత్యం మందపాటి | 6 |
| యుగానికి ఒక్కడు | వినాయక రావు | 7 |
| శతాబ్ది వెన్నెల | డా కె గీత | 8 |
| పట్టు కుచ్చుల పువ్వు | దాశరాజు రామారావు | 9 |
| సమాంతర ఛాయలు | మువ్వా శ్రీనివాస రావు | 10 |
| మహా యానం | వేమూరి వెంకటేశ్వరరావు | 11 |
| దూప | రవి వీరెల్లి | 12 |
| ఆ నేల ఆ నీరు ఆ గాలి | వేలూరి వెంకటేశ్వరరావు | 13 |
| అవతలి వైపు | శ్రీపాద స్వాతి | 14 |
| విదేశీ కోడలు | కోసూరి ఉమాభారతి | 15 |
| ఆధ్యాత్మిక విశేషాలు | విద్వాన్ తిరుమల పెద్దింటి నరసింహాచార్యులు | 16 |
| మీ జాతకాన్ని మీరే పరిశీలించుకొండి | పాలగుమ్మి రామకృష్ణారావు | 17 |
| మనం మైనస్ నువ్వు | నాదెళ్ళ అనూరాధ | 18 |
| సర్దేశాయి తిరుమల రావు | డా నాగసూరి వేణుగోపాలరావు | 19 |
| రంగుటద్దాల గది | యు ఎ నరసింహమూర్తి | 20 |
| కధాకృతి | విహారి | 21 |
| అంతర్యానం | కొండముది సాయికిరణ్ కుమార్ | 22 |

| | | |
|---|---|---|
| ఆద్యంతాలు | డా నందమూరి లక్ష్మీ పార్వతి | 23 |
| ఆంధ్రనగరి | సాయి పాపినేని | 24 |
| హాస్యనట చక్రవర్తి రేలంగి | టి ఎస్ జగన్మోహన్ | 25 |
| మొట్ట మొదటి జాతీయ యువ సాహితీ సమ్మేళనం | 2013 | 26 |
| బట్టర్ ఫ్లై | అరుణ చింత | 27 |
| ఊహ చిత్రం | అరిపిరాల సత్యప్రసాద్ | 28 |
| జీవితమే సఫలము | డా వి వి రామారావు | 29 |
| వైదేహి | డా నందమూరి లక్ష్మీ పార్వతి | 30 |
| మిణుగురులు | డా రమణి యశస్వి | 31 |
| మానవవాద జర్నలిస్ట్ ఇన్నయ్య జర్నీ | డా ఇన్నయ్య | 32 |
| ఇంటి మీద దుప్పటి | ఎస్ గణపతిరావు | 33 |
| పెళ్ళాల పులి | జె యు బి వి ప్రసాద్ | 34 |
| ప్లీడరుగారి తోట | రామకృష్ణ శాస్త్రి | 35 |
| సమ్మాన్యుడు | చెంబోలు శ్రీరామ శాస్త్రి | 36 |
| విధాత | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 37 |
| డా యల్లాప్రగడ సుబ్బారావు | అబ్బూరి ఛాయాదేవి | 38 |
| భారతోపనిషత్ రూపావతారం | నారాయణశర్మ | 39 |
| జీవితమే నవీనం | వెనిగళ్ళ కోమల | 40 |
| భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆత్మ కథ | అక్కిరాజు రమాపతిరావు | 41 |
| పునశ్చరణం | డా వైదేహి శశిధర్ | 42 |
| ఒక అమ్మ ఆక్రోశం | ఉమ ఎయ్యుణ్ణి | 43 |
| సాహిత్యాకాశంలో సగం | కాత్యాయనీ విద్మహే | 44 |
| కుంకుడు కాయ | డా రావిరంగరావు | 45 |
| లోయ నుంచి శిఖరానికి | యండమూరి వీరేంద్రనాథ్ | 46 |
| ఈ కిటికీ తెరుచుకునేది ఉహల్లోకే | షంషాద్ | 47 |
| నరేంద్ర మోడీ | ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ | 48 |
| చెరగని ముద్రలు | ఆకెళ్ళ రాఘవేంద్ర | 49 |
| యాత్ర దీపిక హైదరాబాద్ నుంచి ఒక రోజులో | పి యస్ యమ్ లక్ష్మి | 50 |
| కవితాస్త్రాలయ 2014 | భువన విజయం | 51 |



# పుస్తక పరిచయం




**Published by:**
**K.Padma**
**Kasturi Prachuranalu**
**Plot# 32, Dammaiguda**
**HYDERABAD – 500 083**
**Cell#: 98496 17392**

**Copies available at:**
Navodaya Book House
Digital Copies: kingie.com

‘**తెలుగుకథ** ఇతర భాషల కథలలా, అన్నివైపులా సమానంగా ఎదిగిన మహావృక్షంలా ఎదగలేదు. ఒకే కొమ్మ ఒకే వైపు విపరీతంగా ఎదగగా, మిగతా కొమ్మలు ఎదగక కుఋచగా ఉండిపోయిన వికృత వృక్షంలా ఎదుగుతోంది తెలుగు కథ‘ అని నమ్మిన రచయిత కస్తూరి మురళీకృష్ణగారు. తెలుగు కథావృక్షానికి విభిన్న శాఖలని విస్తరించే ప్రయత్నంలో లోగడ సైన్స్ ఫిక్షన్ కథలు, హిస్టారికల్ ఫిక్షన్ కథలు, కేవలం జ్యోతిశ్శాస్త్రం ఆధారంగా వ్రాసిన కథలు -- వ్రాశారు. అందులో భాగంగానే తెలుగు కథా చరిత్రలో ఇంతవరకూ రాని ప్రక్రియ భయానక కథలు (హారర్ స్టోరీస్) సంపుటిగా ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకంలోని కథలన్నీ నవ్య వారపత్రికలో హారర్ స్టోరీ శీర్షికలో ప్రచురితమయ్యాయి. ఈ సంపుటిలోని కథలన్నీ ప్రథమపురుషలోనే సాగుతాయి. అందుకు కారణాన్ని కూడ రచయిత ముందుమాటలో చెప్పారు. ప్రతికథనీ ఒక ప్రత్యేక హారర్ కథగా తీర్చిదిద్దే క్రమంలో ఆయా కథల రచన వెనుకనున్న ప్రయత్నాన్నీ. నేపథ్యాన్నీ కూడా ముందుమాటలో వివరంగా చర్చించారు.

ఆ అరగంటచాలు కథ దాదాపు ఇరవయ్యేళ్ళ క్రిందట వ్రాసినా అందులో ఉదహరించిన - అక్షరాలని తరంగాలుగా మార్చే కంప్యూటర్లూ, రకరకాల భాషలని అర్థం చేసుకునే కంప్యూటర్లు - రచయిత నిశితమైన ఊహాశక్తికి నిదర్శనాలు. ‘ఫాంటమ్ లింబ్‘ కథ ఓ శాస్త్రీయ భావనకి కాల్పనిక రూపం. చదువుతున్నంతసేపూ ‘అవును ఇలా జరిగితే ఎలా ఉంటుంది.? ఏదో నాటికి, ఇలా అవయవాలు కోల్పోయిన సంఘటనల్లో శాస్త్రజ్ఞులు మెదడుని నియంత్రించడం ద్వారా వాటికి కొత్త రూపాన్నిస్తారేమో..‘ లాంటి ఆలోచనలు పాఠకులకి వస్తాయంటే అది రచయిత కల్పనాశక్తికి గల బలమే.! అలానే మిగతా కథలు - కలకానిదీ, ప్రేయసి కౌగిలిలో, ఊర్మిళ, తెల్లపొగ - మొదలైన వన్నీ. ఏ కథ ఐనా చదువుతున్నంతసేపూ పాఠకుడి ఆలోచనల్లో ఒక విచిత్ర ప్రపంచం, సంఘటనలు రూపుదిద్దుకుంటాయి. రచయిత వ్రాసిన సంఘటనలు దృశ్యరూపంలో సాక్షాత్కరించినట్లనిపిస్తాయి. కథ ఉత్సుకతతో చివరంటా చదివిస్తుంది. చివరలో వచ్చే ఊహించని ముగింపు ఒక్కసారిగా ఒళ్ళు జలదరింప చేస్తుంది. ముగింపు వాక్యం చదివాక మళ్ళీ ఒకసారి వెనక్కు తిరిగి కథంతా చదివి, చివరి వాక్యానికి దారితీసిన సంఘటనలేమిటో మరోసారి తెలుసుకోవలనిపిస్తుంది. హారర్ కథలని తెలుగు పాఠకులకి అందించడంలో మురళీకృష్ణగారు పూర్తిగా సఫలీకృతులయ్యారని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

***





**Published by:**
**P.S.M. Lakshmi**
**B 391, Sri Krishna Nagar,**
**Yousufguda, Hyderabad - 500 045**

**Copies available at:**
**Navodaya Book House**
**Vishalandhra Book House.**

**Digital Copies: kinige.com**


**భారతదేశంలోని** అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా దేవాలయాల సంఖ్య అధికమే. ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన అనేక దేవాలయాలు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలోనూ ఉన్నాయి. చాలా దేవాలయాలకి భక్తులు, పర్యాటకులు వెళ్ళినా ఆయా దేవాలయాల చరిత్ర తెలిసిన వాళ్ళు చాలా తక్కువమంది ఉంటారు. స్థానికుల్లో కూడా చాలా మందికి ఆ దేవాలయ చరిత్ర తెలియదంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఏ దేవాలయాన్నైనా, పర్యాటక ప్రదేశాన్నైనా భక్తితోనో, ఆహ్లాదంకోసమే దర్శించడం ఒక పద్ధతి ఐతే ఆయా స్థలపురాణాలని కూలంకషంగా తెలుసుకుని దర్శించడం మరో విధానం. అన్నీ తెలుసుకుని దర్శించడమో, దర్శించినపుడు అన్నీ తెలుసుకోవడమో చేస్తే ఆ జ్ఞాపకాలు మనసులో ఎప్పటికీ మిగిలిపోవడమే కాక ఆయా ప్రదేశాలని మరింత ఆసక్తితో గమనించడానికి వీలౌతుంది. సరిగ్గా ఇలాంటి ప్రయోజనాన్ని ఆశించి వ్రాసిందే పి.ఎస్.ఎమ్. లక్ష్మి గారి యాత్రాదర్శిని-వరంగల్ జిల్లా. వరంగల్, హనుమకొండ, ఖాజీపేట పరిసర ప్రాంతాలే కాక మొత్తం వరంగల్ జిల్లాలోని దాదాపు పాతిక దేవాలయాల గురించి, పర్యాటక ప్రదేశాల గురించి చక్కటి సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు రచయిత్రి. రామప్ప దేవాలయం, భద్రకాళి ఆలయం లాంటి ప్రసిద్ధదేవాలయాల గురించే కాక ఎమ్.జి.ఎమ్.ఆసుపత్రి సమీపంలో ఉన్న దేవాలయం రాజరాజేశ్వరీ ఆలయం వంటి ప్రదేశాల గురించి కూడా చక్కగా సవివరంగా తెలియచేశారు. ప్రతి ఆలయం గురించి కేవలం చారిత్రక గణాంకాలనే కాక ఆయా ప్రదేశాల వెనుకనున్న కథల గురించి, కాలానుగతంగా వచ్చిన పరిణామాల గురించి చాలా ఆసక్తికరంగా వ్రాసారు. అలానే ఆయా స్థలాలకి ఎలా వెళ్ళాలో , ప్రయాణాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా వ్రాసారు. సందర్భానుసారం జోడించిన ఛాయా చిత్రాలు పుస్తకానికి అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఈ పుస్తకం చదువుతున్నంత సేపు ఆయా ప్రదేశాలని ప్రత్యక్షంగా దర్శించిన అనుభూతి కలుగుతుంది. సరళమైన శైలిలో సాగిన ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ లోగడ వివిధ పత్రికలలో వచ్చినవే కావడం ఒక విశేషం. ఒక మంచి ప్రయత్నం చేసి విలువైన విషయాలని గ్రంథస్థం చేసి పాఠకులకి అందించిన రచయిత్రి అభినందనీయులు.

***

# పుస్తక పరిచయం




**నవల, కథ, కథానిక,** కవిత..సాహితీ ప్రక్రియ చిన్నదవుతున్న కొద్దీ చెప్పదలచుకున్న అంశాన్ని అందులో ఇమడ్చడం రచయితకి పెద్ద సవాల్. రచన నిడివికి పరిమితి లేకపోతే ఎంతైనా వ్రాసుకోవచ్చు, ఏదైనా చెప్పొచ్చు. పద్యం లాంటి నాలుగు పదాల ప్రక్రియలో ఒక పరిపూర్ణమైన భావాన్ని సమర్థవంతంగా, సమగ్రంగా ఆవిష్కరించడంలో రచయిత ప్రతిభ బయటపడుతుంది. రచయిత ఇందులో వ్రాసిన ఛందోబద్ధమైన పద్యాలు కాకపోయినా వీటిని 'పద్యాలు' అని పిలవడానికి ఒక కారణం - అన్నీ నాలుగు పాదాల ప్రక్రియలే కాబట్టి అని అనుకోవచ్చు. ముఖ్యంగా ఇవన్నీ అంత్యప్రాసల బలం మీద సాగుతాయి. ముందులోనే చెప్పారు రచయిత - వీటిని ఆరుద్రగారి స్ఫూర్తితో రాశానని.

ఈ పుస్తకంలోవి 'వంటింటి పద్యాలు' కాబట్టి వీటిల్లో అన్ని రుచులూ ఉన్నాయి. తియ్యగా అనిపించేవి కొన్ని, చేదునిజాలని చెప్పేవి కొన్నీ, ఘాటుగా తగిలేవి మరికొన్నీ, కారం కారంగా నసాళానికి అంటేవి ఇంకొన్నీ - వెరసి అన్ని రుచులనీ అందించారీ పద్యాలు కాని పద్యాల్లో. అమెరికా వంటింటి నుంచి మొదలయ్యాయి కాబట్టి ముందులో సుబ్బారావు, అప్పారావు, నరసమ్మ అనే మూడు పాత్రలని పరిచయం చేసి వాళ్ళ అమెరికా ప్రయాణ ప్రయత్నాలు, అమెరికా వచ్చాక తొలి అనుభవాలూ అందరికీ అన్వయించేలా చెప్పారు. మధ్యలో అనేక విషయాలని స్పృశించినా మళ్ళీ చివరలో ఈ ముగ్గురూ అమెరికాలో ఎలా జీవిస్తున్నారో చెప్పి ఈ పద్యాలని ముగించడం ఎంతో చక్కగా ఉంది. ఎంత అమెరికాలో ఉన్నా మన దేశం గురించి ఆలోచించడం మానకోలేం, మన వూరు వార్తాపత్రికలు చదవకుండా ఉండలేం. అందుకే ఈ పద్యాల్లో సగం దాటాక సమకాలీన - ఆంధ్రదేశంలోని రాజకీయాల మీద, మారిన జీవన విధానాల మీద , సినిమాల మీద చెణుకులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ప్రతి పద్యానికీ పెట్టిన శీర్షికలు పాఠకులని ఆకట్టుకుంటాయి, దానిలో ఏముందో చదవాలన్న ఉత్సుకతని కలిగిస్తాయి. కొన్ని ఖండికలకి గోపి బూరుగు వేసిన కార్టూనులు కూడా సందర్భోచితంగా ఉండి పుస్తకానికి అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఈ పుస్తకంలో ఉన్న 116 ఖండికలూ దేనికదే ఒక ఆణిముత్యం. ఆద్యంతం చదివితే తప్ప వాటిలోని మాధుర్యం పూర్తిగా తెలీదు. తేలిగ్గా అనిపిస్తాయి, తేలిగ్గా కనిపిస్తాయి. తేలిగ్గా చదివిస్తాయి.. కానీ బరువైన భావాలని కలిగిస్తాయి, గుండెపొరలని కదిలిస్తాయి!

***

.

**Writer Address:**

**Satyam Mandapati**
**1006 Vanderbilt Circle**
**Pflugerville, TX – 78660**
**Phone: 512-251-3768**

**Copies available at:**
**Visalandhra Book House**




**విశ్వవిఖ్యాత నటసార్వభౌమ** ఎన్టీ రామారావుగారి జీవితం తెరిచిన పుస్తకమే. ఆయన నటజీవితం గురించి, రాజకీయ జీవితం గురించి, వ్యక్తిగత జీవితం గురించి కూడా చాలా పుస్తకాలు, పత్రికల్లో వ్యాసాలు వచ్చాయి. ఐనా ఆయన గురించి ఒక పుస్తకం, అందునా ఉద్గ్రంథం వ్రాయాలంటే రచయితకీ ఎంతో నేపథ్యం ఉండాలి. ఎన్టీఆర్‌ని పలుసార్లు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూ చేసిన అనుభవాన్నీ , దశాబ్దాల నాటి పత్రికలనుంచీ సేకరించిన విలువైన సమాచారాన్నీ రంగరించి అరుదైన గ్రంథంగా 'యుగానికొక్కడు'ని రూపొందించిన రచయిత, ప్రముఖ సినీ జర్నలిస్ట్ వినాయకరావుగారిని అభినందించాలి. విషయం ఏదైనా, రచయిత చెప్పే విధానంలో ఒక పుస్తకం యొక్క గొప్పదనమూ, రచయిత ప్రతిభా బయటపడతాయనేది యదార్థం. ఈ పుస్తకం విషయంలో వస్తువూ, శైలీ రెండూ కూడా రచయిత ప్రతిభకి దర్పణాలే. ఇది ఎన్టీఆర్ జీవిత చరిత్రకాదు. ఎన్టీఅర్ నట జీవితంలోని వివిధ కోణాలనీ సమగ్రంగా, సవివరంగా ఆవిష్కరించిన అరుదైన సమాచార, చిత్ర సంకలనం. ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల విశ్లేషణ, విశిష్టతలు, ఎన్టీఆర్ జానపద చిత్రాల ప్రత్యేకతలు, ఎన్టీఆర్ నటజీవితంలోని అత్యంత ఆసక్తికరమైన సందర్భాలు, సన్నివేశాలు అనితరసాధ్యంగా పొందుపరిచిన పుస్తకం ఇది. ఎన్టీఆర్ అవార్డు గెలుచుకున్న ఇంటర్వ్యూ (రచయిత ఎన్టీఆర్‌తో సంభాషణ) తో మొదలైంది ఈ పుస్తకం. ఎన్టీఆర్ నటజీవితాన్ని మలుపుతిప్పిన ఆ ఐదు చిత్రాలు, విజయానుబంధం, రామారావు సినిమాల్లో అంతర్నాటకాలు, ..లాంటి వ్యాసాలు కేవలం సమాచార సేకరణలాగా కాకుండా చక్కటి విశ్లేషణా శైలిలో సాగాయి. అలానే మొఘల్-ఎ-ఆజం స్ఫూర్తితో 'అక్బర్ సలీం అనార్కలి',' విడుదలైన చివరి చిత్రం శ్రీనాథ కవిసార్వభౌముడు, విదేశాల్లో షూటింగ్ జరుపుకున్న తొలిచిత్రం 'సాహసవంతుడు',' పూర్తిస్థాయి వృద్ధపాత్రలు పోషించిన 'భీష్మ, బడిపంతులు','వామహస్త అభయం వెనుక అసలు రహస్యం' -లాంటి అధ్యాయాలు అభిమానులకే కాక అందరినీ ఆసక్తికరంగ చదివిస్తాయి.

360 పేజీల ఈ పుస్తకం, మేలిమి ముద్రణతో కలెక్టర్స్ ఎడిషన్‌లా రూపుదిద్దుకుంది. రచయిత కృషి ప్రతి పేజీలోనూ సుస్పష్టంగా కనిపిస్తుంది.

***

**U.Vinayaka Rao**
***Flat# : 102, SriSri Srinivasa Nilayam***
***7-1-303/D/2 -Sanjeeva Reddy nagar,***
***Hyderabad - 500 038***
***Phone: 998 541 1019***

**vinayakaraou@gmail.com**
**Visalandhra Book House**

# పుస్తక పరిచయం




**చక్కటి, చిక్కటి** కవిత్వం వ్రాసే వర్తమాన రచయిత్రులలో ముందు వరుసలో చూడదగిన కవయిత్రి డా.కె.గీత. ఈ 'శతాబ్ది వెన్నెల' ఆమె వెలువరించిన మూడవ స్వీయకవితా సంపుటి. ఇందులోని కవితలన్నీ ప్రవాసదేశం నుంచీ వ్రాసినవే ఐనా స్వచ్ఛమైన స్వదేశీ హృదయం ఉంది ఈ కవితల నిండా. ఈ కవయిత్రి కలంలో ఏ సందర్భమైనా అద్భుతమైన కవితగా రూపుదిద్దుకుంటుంది. సరికొత్త పదప్రయోగాలతో, విభిన్నమైన పదచిత్రాలతో హృదయాన్ని తడిమే భావాలతో ప్రతికవితా చదువుతున్న ప్రతిసారీ సరికొత్తగా కనిపిస్తుంది. దాచుకుని మరీ చదవాలనిపించే ఆత్మీయత ఈ కవితల్లోని ఆత్మ. ఈ పుస్తకానికి మకుటమైన 'శతాబ్ది వెన్నెల' 'స్థిమితంగా పసిపాపతో ఆడుకునే అద్భుతమైన వర్తమాన సందర్భం' ! తనలో పెరుగుతున్న పాపాయితో సంభాషించే మాతృహృదయాన్ని ఆవిష్కరించిన ఈ కవితలో 'నీ రూపంలో నేను మళ్ళీ / ఓ వందేళ్ళు పోగు చేసుకుంటాను / నీ నించి ప్రవహించే రక్తమై పరిణామం చెంది / శతాబ్దాల తరబడి జీవించే ఉంటాను / కృతజ్ఞతలు పాపాయీ!' అంటారు కవయిత్రి. తల్లి రూపం ఒకతరం నుంచి మరో తరానికి రక్తకణమై ప్రవహిస్తూనే ఉంటుంది, అందుకే అది ఒక పక్షపు వెన్నెల కాదు - అది శతాబ్ది వెన్నెల! విదేశంలో తనని చూడ్డానికి వచ్చి తిరిగి వెళ్ళిపోతున్న అమ్మకి వీడ్కోలు చెబుతూ ' ఆరు నెల్ల కంటే ఎక్కువ పరాయిదేశం పర్మిటించదు / ఒకసారి నీ నించి విడిపడిన పుత్రికా రత్నం నీతో వెనక్కి ప్రయాణించదు / అయినా చివరి నిమిషంలో వెనకే పరుగెత్తి రావాలనిపించింది / మళ్ళీ ఒకసారి నీ కడుపులోకి ప్రవహించి హాయిగా నిద్రించాలనిపించింది' అంటారు. కడుపులోకి ప్రవహించడం లాంటి ప్రయోగాలు ఈ కవయిత్రికి సొంతగొంతుక నిస్తున్నాయి. ఈ కవితల్లో ఒక తల్లి, ఒక పాపాయి, ఒకనేస్తం, ఒక పథికురాలు, ఒక యాత్రికురాలు..ఎంతోమంది విభిన్నమైన కోణాల్లో దర్శనమిస్తారు. చాలామందికి తోచని సన్నివేశాలెన్నో డా.గీతగారి సృజనలో అందమైన కవితలౌతాయి. పుస్తకం చదవడం పూర్తయేసరికి మనసు ఆర్ద్రమౌతుంది. మరోసారి పుటలని వెనక్కి తిప్పాలనిపిస్తుంది.

***

***Copies available at:***

***Visalandhra Book House***
***Prajashakti Book House***
***Navodaya Book House***

***Writer Contacts:***
**kgeetamadhavi@gmail.com**
**USA Phone: 408-483-7700**




**దాసరాజు రామారావుగారి** ‘పట్టుకుచ్చుల పువ్వు‘ ఆలోచింపచేసే కవితల సంపుటి. అనుభూతి కంటే మనసుని నిలదీసే కవితలే ఈ సంపుటిలో అధికశాతం ఉన్నాయి. కవి హృదయం లోతుల్లోంచి పెల్లుబుకిన గంభీర భావాలకి ప్రతిరూపం ఇందులోని ప్రతి కవిత. ముందు మాటలో వరవరరావుగారు చెప్పినట్లు ఈ కవితలన్నింటిలోనూ ఎక్కువగా కనిపించే మూలభావం ‘మనిషిలోని మనిషితనం పరాయీకరింపబడడం గురించి పడిన ఆవేదన‘. ఈ కవితల్లోని శిల్పం గురించి వ్రాస్తూ వరవరరావుగారు ‘ఒక సుకుమారమైన సున్నితమైన భావశబలత, ఎటువంటి గడ్డురోజుల్లోను సమతాసుందరి భవిష్యత్ స్వప్నాలను చూడగల ఊహ, కవితోహ పరుచుకుని ఉంటుంది‘ అని పేర్కొన్నారు. రచయిత రామారావుగారు తెలంగాణా ఉద్యమంలోని పలుకోణాలని కవితారూపంలో వ్యక్తీకరించారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ కవితలు ఎలాంటి బలాన్ని సంతరించుకున్నాయో ముందుమాటలో వరవరరావుగారు సవివరంగా సమీక్షించారు. కవితల్లోకి వెళ్ళడానికి ముందు, ఈ సమీక్ష చదివే పాఠకులకి ఒక ఆలోచనా వేదిక సిద్ధమౌతుంది. ఏ కవితా కూడా ఉబుసుపోక వ్రాసినట్లుగానీ, తేలిక భావాలతో వ్రాసినట్లు గానీ అనిపించదు. ప్రతి కవితలోనూ రచయిత భావతీవ్రత పస్ఫుటమౌతుంది. తోటిప్రయాణికుడ్ని మూగ అని గుర్తించిన కవి హృదయం ‘ పువ్వునుంచి పుప్పొడి రాలినట్లు / అస్పృశ్యత సోకని మేఘాలు / గగనంలో కలబోసుకున్నట్లు / అతను మాట్లాడుతడు‘ అని స్పందిస్తుంది. ‘నాలో / కవిత్వమైన వాడికి / మాటలతో పనేమిటి‘ అని ముగిస్తారు. వెలుగు తగ్గిపోతున్న మాతృభాష గురించి వ్రాస్తూ ‘సృజనకై / ఏ భాషలో ఆలోచిస్తవు? / ఆకలిగొన్న పులి ఎదురైందనుకో / గుప్పుమన్న భయం / తప్పించుకునే ఉపాయం / ఏ భాషలో రాసుకుంటవు?‘ అని ప్రశ్నిస్తారు. 'రెండు మెత్తని స్పీకర్ బిళ్ళలు / చెవుల నిండారా / జీవన వైశాల్యం అంతటా కమ్ముకుంటూ‘ వ్యాపిస్తున్న ఎఫ్.ఎమ్ సంస్కృతిని కూడా ఈ కవి తన కవితలో ఎక్స్‌రే తీసి చూపించారు. చదివి ఆలోచించాల్సిన కవితల సంపుటి ఈ ‘ ‘పట్టుకుచ్చుల పువ్వు‘

***

**For Copies:**
**Visalandhra, Sahachara,**
**Disha, Palapitta, Navodaya, Samantara**
**ebook : www.kinige.com**

**Writer:**
**Email : daasaraju@gmail.com**
**Cell : 9618224503**



# పుస్తక పరిచయం

**తెలుగు కవితా ప్రపంచంలోకి** తనదైన కొత్త గొంతుకతో పెను తుఫానులా ప్రవేశించిన కవి మువ్వా శ్రీనివాస రావుగారు. ఈ తుఫాను ప్రకృతిని ధ్వంసం చేసేది కాదు. కవితా ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపే బలశాలి. కవితా ప్రియుల మనసుల్లో ఆలోచనల సుడిగాలులు రేకెత్తించే ప్రభంజనం. తుఫాను ఎప్పుడూ ముందుగా చెప్పిరాదు, ఉన్నట్టుండి ముంచేస్తుంది. శ్రీనివాసరావుగారు కూడా ఈ కవితా రంగంలోకి హఠాత్తుగా వచ్చేశారు. ఎప్పుడో ఎనిమిదో తరగతిలో వదిలేసిన రచనా వ్యాసంగాన్ని 52వ ఏట పునరుజ్జీవింప చేసుకుని రోజుకో కవిత వ్రాసే వేగాన్ని పుంజుకున్నారు. "శ్రీశ్రీ ఆరాధనలోంచి, కమ్యూనిజం నేర్పిన సారంలోంచి వచ్చిన కవితలివి.." అని ముందుమాటలో చెప్పుకున్నారు శ్రీనివాసరావుగారు. ఏ వాదాన్ని నమ్ముకుని వ్రాసినా ఈ కవితలన్నింటిలోనూ మానవీయత తొంగిచూస్తుంది. ఆర్ద్రత - ఆత్మీయంగా స్పర్శిస్తుంది. ఒక్కో కవిత చదవడం పూర్తవగానే ఒక ఆలోచన, ఒక కదలిక.. 'విజయం వెనకాల / పరుగెత్తడం మానుకోలేం / విజయంపై సవారీ చేయడానికి / సాహసమూ చేయలేం / పగిలిపోయిన మొహాలు కదా మనవి' - ఇలాంటి వాక్యాలు వర్తమానానికి ఒక దర్పణం. కొన్ని వ్యక్తిత్వాలకి సవాలు!! 'జీవితమంటే / నేల ముసుగేసుకున్న / నీటి దుప్పటిని లాగేందుకు / చంద్రుడు చేసే సాహసం ' జీవితాన్ని ఎంతో మంది కవులు ఎన్నో విధాలుగా నిర్వచించారు కానీ ఇంత గాఢమైన భావన నిండిన పదచిత్రంలో జీవిత నిర్వచనాన్ని పొదిగిన శ్రీనివాసరావుగారి కవిత్వాన్ని అభినందించకుండా ఉండలేం. 'లాంతర్లు కలల్లోకి నడిచి రావడం, ' 'లేపాక్షి ఆలయంలో వ్రేలాడే స్తంభమై ఊరేగడం, ', ఆకాశం చీకటి దీపాన్ని ముట్టించడం', ' బ్రతికున్న కళేబరాలు వృద్ధాశ్రమంలో చేరడం, ' బతుకు తాడుని పేనుకోవడం'..ఇలాంటి భావాలతో నిండిన ఒక్కో కవితా ఒక్కో మచ్చు తునక. ఈ సంపుటిలో మంచి కవితలని ఎంపిక చేయండి అంటే మంచి కవితల మొత్తం 93 అని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే ఈ సంపుటిలో ఉన్నవి 93 కవితలు మాత్రమే! పుస్తకం చదవడం పూర్తవగానే ఒక ప్రవాహంలో కొట్టుకుపోయిన అనుభూతి కలుగుతుంది.! పుస్తకం చివరలో దాదాపు 60 పేజీలు ప్రముఖుల విశ్లేషణలున్నాయి. చివరగా ఇందులోని ఓ వెన్నల తునక ' నీవు నా దాన్ననే ఒక్కమాట చెప్పు చాలు / నేనొక్కణ్ణే రెండు ముక్కలై / సగం నీకిచ్చి సగం నేనై / మళ్ళీ ఒక్కటిగా కలిసిపోయి / నీవాడిగా మిగిలిపోతా!! '.

***




**Copies available at:**

**Prajashakti Book House**
**Navodaya Book House**

**Writer Contacts:**
kranthisrinivasarao@gmail.com
Phone: 91+ 99480 99900




**అమెరికాలోని** ప్రవాసాంధ్ర రచయితల్లో తనకంటూ ఒక ప్రత్యేకతని నిలుపుకుంటూ రచనలు సాగిస్తున్న రచయిత డా.వేమూరి వెంకటేశ్వరరావు గారు. ఇంతకు ముందే కథా సంపుటులు, వ్యాస సంపుటులు, ఇంగ్లీషు–తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు మొదలైన పుస్తకాలని ప్రచురించారు. కథా రచయితగా వేమూరి వెంకటేశ్వరరావుగారి శైలి చాలా విభిన్నమైనది. ఈయన ఎన్నుకునే కథాంశాలు కూడ చాలా విలక్షణమైనవి. ఇలాంటి కథాంశాలతో కథలు వ్రాసే రచయితలు చాల అరుదు అని చెప్పవచ్చు. గత 40 సంవత్సరాల్లో సుమారు 30 కథలు మాత్రమే వ్రాశారంటే, ఒక్కో కథా రచనకి ఎంత తపిస్తారో అర్థం చేసుకోవచ్చు. వీరి కథల్లో ఆంగ్లవాక్య ప్రయోగం అస్సలు ఉండదని చెప్పవచ్చు. ఒక్కోవాక్యం శిల్పం చెక్కినట్లు అచ్చతెనుగు పదాలతో పరిమళిస్తూ ఉంటుంది. ప్రస్తుత కథా సంపుటిలో వెంకటేశ్వరరావుగారు వ్రాసిన 12 కథలు ఉన్నాయి. ఇందులో నాలుగు కథలు ‘సాహస యాత్రలు‘ కోవలోకి చెందినవి. కొన్ని నిజజీవితంలోని సంఘటనలు ఆధారంగా చేసుకుని వ్రాసినవి. మరికొన్ని సైంటిఫిక్ ఫిక్షన్ కథలు. వృత్తిరీత్యా వెంకటేశ్వరరావుగారు కంప్యూటర్ శాస్త్రవేత్తగా కొన్ని దశాబ్దాల పాటు పనిచేశారు కాబట్టి వీరు వ్రాసిన వైజ్ఞానిక కల్పనల్లో ఎంతో రీజనింగ్ ఉంటుంది. ఈ కథల్లో రచయిత సృష్టించిన కాల్పనిక జగత్తులు ( అభయారణ్యాలు కానీవండి, ధృవ ప్రాంతంలోని మంచు పర్వతాలు కానీవండి) చదువరులలో ఉత్సాహాన్ని రేకెత్తించడమే కాక, చదువరులని యా లోకాల్లోకి తీసుకెళతాయి. చదువుతున్నంతసేపూ పాఠకులు ఆ కాల్పనిక జగత్తులో విహరిస్తారు. గతకాలానికి సంబంధించిన కథాంశమైనా, భవిష్యత్తుకి సంబంధించిన కథాంశమైనా ఎక్కడా బిగి సడలకుండా, ఆసక్తి తగ్గకుండా చదివింపచేయడం ఈ కథల ప్రత్యేకత. ప్రస్తుతానికి ఈ పుస్తకం కినిగె డాట్ కామ్ లో ఇ - -పుస్తకంగా అమాత్రమే లభ్యమౌతోంది. త్వరలోనే పుస్తక రూపంలో కూడా ప్రచురితమై మరింతమంది తెలుగు వారికి దగ్గరౌతుందని ఆశిద్దాం.

***

**For Copies:**

**ebook : www.kinige.com**

**Writer:**
**Email : rvemuri@gmail.com**

# పుస్తక పరిచయం




**కొత్తగళంతో,** కొత్తకలంతో కవితారంగంలోకి అడుగుపెట్టిన ప్రవాసాంధ్ర కవి రవి వీరెల్లి. ఈయన అక్షరాల నిండా మట్టివాసనని నింపుకుని వచ్చారు, పదాలనిండా జ్ఞాపకాలని పొదువుకుని వచ్చారు, వాక్యాలనిండా 'నిన్ను' నింపుకుని వచ్చారు...వెరసి చక్కటి చిక్కటి కవిత్వంతో సరికొత్తగా పలకరించడానికి 'దూప'తో కవితాప్రియుల ముందుకి వచ్చారు. 'పోయిన రెండేండ్లలో చేసిన నా సాహిత్య యాత్రకి అక్షర రూపం నా ఈ మొట్టమొదటి సంకలనం' అన్నారు కానీ కవిగా ఆయనకి ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నట్లే అనిపిస్తుంది, ఈ సంపుటిలోని కవితా సాంద్రతని గమనిస్తే. చదువరికి ఒక్కో కవితా ఒక్కో జ్ఞాపకంగా మిగులుతుంది. మరొక్కసారి వెనక్కు తిరిగి అద్భుతమైన పదచిత్రాలని ఇంకోసారి మనసారా ఆస్వాదించాలనిపిస్తుంది. 'కాలం వదిలి వెళ్ళిన జ్ఞాపకాల నీడల్లో / నీకై ప్రతీక్షించే నాకు వృద్ధాప్యం వచ్చిన అలికిడే వినిపించలేదు' , 'పేనుకున్న జ్ఞాపకాల తాడు / రెండు కొసలూ నేనే పట్టుకుని / దిగులు అట్టడుగు పొరల్లో ఎక్కడో / నేను' - ఇవి కవి జ్ఞాపకాలే కాదు, జీవితాన్ని కౌగలించుకున్న ప్రతి పాఠకుడి జ్ఞాపకాలు కూడా. 'నీకు / కాచుకోడానికి వెలుగు కుంపట్లు / కప్పుకోడానికి వెన్నెల దుప్పట్లూ తెచ్చిస్తా / ఏడాదంతా నా రుతువుల రథం మీద సవారి చేయిస్తూ' నేలతల్లిని ఇంత వినూత్నంగా ఎవరూ చూపించలేదేమో! 'వత్తి సరి చేసుకోవాలే కానీ / గతం దీపం బుడ్డి నిండా బోల్డన్ని జ్ఞాపకాలు' అంటూ ప్రతి హృదయాన్నీ స్పృశిస్తారు. ముందుమాటలో ప్రముఖ కవి అఫ్సర్‌గారు "రవి జీవితంలో కానీ కవిత్వంలో కానీ ఈ నాలుగు చోట్లూ - ఆముదాలపల్లెలో ఆరు బయలో, కరీమ్‌నగరులో మిద్దెమీదో, హైదరాబాద్‌లోని ఏడంతస్తుల మేడో, వర్జీనియాలోని రోనోక్ నగరమో - కనిపించకపోతే ఆ దృశ్యం అసంపూర్ణంగా మిగిలిపోతుంది " అన్నారు. రవి వీరెల్లి గారి కవితలన్నీ పరిపూర్ణత్వాన్ని సంతరించుకున్నవే. ఆయా ప్రదేశాలని, తన అనుభవాలని కవిత్వీకరించి, మనల్నీ వాటిలో మమేకం చేసిన కవి రవిగారిని అభినందించి తీరాలి. 'మంచి కవిత్వం అంటే ఏమిటి?' అని ఎవరైనా అడిగితే సమాధానంగా ఈ 'దూప'ని చూపించండి.

*Writer Contact:*
Ravi Verelly
6003 Matissa Ln
Roanoke, VA - 24018
ravinder.verelly@gmail.com

*Available at:*
All leading book stalls

*e-book:* www.kinige.com

***




*Writer Contact:*
**Veluri Venkateswara Rao**
**1853 Royal Troon Ct**
**Duluth , GA 30097**
**vveluri@gmail.com**

*Sole Distribution:*
**Navodaya Publishers**
**Eluru Road, Vijayawada**

*e-book:* **www.kinige.com**

**అత్యుత్తమ** సాహితీ విలువలతో 'ఈమాట' పత్రికని నడిపిస్తున్న సంపాదకులు, అమెరికాలోని సీనియర్ రచయిత శ్రీ వేలూరి వేంకటేశ్వరరావుగారు వ్రాసిన కథల సంపుటి 'ఆ నేల, ఆ నీరు, ఆ గాలి'. ముందుమాటలో రచయిత చెప్పుకున్నారు "గత యాభై యేళ్ళలో నేను ఒక పాతిక పై చిలుకు 'కథలు', మరో పాతిక సాహితీ 'వ్యాసాలు' రాసి ఉంటాను. సగటున రెండేళ్ళకో కథ, ఒక వ్యాసం అన్నమాట" అని.. రాసి కంటే వాసికి ఎంత విలువనిస్తారో వేలూరిగారి సాహితీ వ్యాసంగం తెలియచేస్తుంది. ఎంతో గాఢమైన అనుభూతి చెందితే తప్ప, మనసుని కదిలించే సంఘటనలు, ఆలోచనలు తారసపడితే తప్ప కథారచనకి పూనుకోరని చెప్పకనే చెప్పారు రచయిత. ఈ నాణ్యత ప్రతి కథలోనూ కనిపిస్తుంది. కథా వస్తువుని ఎన్నుకోవడంలో కానీ, రచనాశైలిని ఒక అందమైన శిల్పంలా తీర్చిదిద్దడంలో కానీ వేలూరిగారి ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రతి కథలోనూ 'ఆత్మ' ఉంది. ఆ అత్మే పాఠకుడిని చివరంటా చదివిస్తుంది. చదువరుల కళ్ళు చెమరింపచేసే మొట్టమొదటి కథ 'గొమేజ్ ఎప్పుడొస్తాడో?'. అమెరికావాసులకి ఇలాంటి గోమేజ్‌లు చాలా మంది పరిచయం ఉండొచ్చు కానీ, రచయిత ఈ కథకి ఇచ్చిన ముగింపు కరుణ రసాన్ని పరాకాష్ఠకి తీసుకెళ్ళింది. దీనికి సరితూగ గలదే 'క్లబ్బులో చెట్టు కథ'. నడకలో సరళత, చిత్రించే సంఘటనలని కళ్ళముందు నిలబెట్టగల వాక్యనిర్మాణం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తాయి. ముందుమాట వ్రాసిన వాసిరెడ్డి నవీన్‌గారు 'వ్యంగ్యాన్ని ఆయుధంగా చేసుకుని రచనలు చేస్తున్న ఒకరిద్దరు రచయితల్లో వేలూరి వేంకటేశ్వరరావు ఒకరు' అన్నారు. వ్యంగ్య కథల్లోనైనా నేలవిడిచి సాముచేసే తత్వం లేకపోవడం, పాత్రల చిత్రణలో తనదైన విలక్షణత చూపించడం - వంటి లక్షణాలతో వేంకటేశ్వరరావుగారు నిఖార్సయిన కథారచయితగా నిలబడ్డారు. పుస్తకం చివరలోని కథాచిత్రాలూ గాఢంగా ఆలోచింపచేస్తాయి. 'తరం మారినా',' యాది',' దాలిగుంటలో లియా',' న్యాయమందిరం,' ఎగిరే గుర్రాలు','తీన్ కన్యా'.. ఇలా .. పుస్తకం చదవడం పూర్తయే సరికి చాలా కాలానికి మంచి సాహిత్యాన్ని చదివిన అనుభూతి మిగులుతుంది.

***

# పుస్తక పరిచయం




**స్వాతి శ్రీపాదగారి** పేరు కౌముది పాఠకులకి చిరపరిచితమే. కౌముదిలో లోగడ రెండు ధారావాహిక నవలలు వ్రాశారు. ఆ రెండూ కూడా పాఠకులని అమితంగా ఆకట్టుకున్నాయి. స్వాతిగారు కవయిత్రి, కథా రచయిత్రి, నవలా రచయిత్రి, అత్యంత సామర్థ్యంతో ఆంగ్లానువాదం చేయగల రచయిత్రి కూడా. సాహితీ రంగంలో బహుముఖీనమైన కృషి చేస్తున్న స్వాతిగారి కథలు ఆమె వ్రాసే కవితలంత సున్నితంగా ఉంటాయి. కవితా రచనల్లో ఉండే క్లుప్తత, స్పష్టత, మనసుని తాకే నేర్పూ ఆమె కథల్లో కూడ కనిపిస్తాయి. సమకాలీన సమస్యలని తనదైన కోణంలో విశ్లేషిస్తూ, శిల్పంలోకానీ. శైలిలో కానీ ఎక్కడా ఔచిత్యభంగం కాకుండా శిల్పం చెక్కినట్లు కథలు వ్రాయడం స్వాతిగారి ప్రత్యేకత. సరళమైన వాక్యాలూ, ఏమాత్రం గందరగోళంలేని పాత్ర చిత్రణా, ఈమె కథలని చివరంటా చదివింపచేస్తాయి. ఎవరూ స్పృశించని కథాంశాలు కొన్ని అయితే, అందరికీ మామూలుగా కనిపించే సంఘటనలనే సరికొత్తగా చూపించే కథాంశాలు కొన్ని. 'అమ్మ' లాంటి కథలు స్వాతిగారి లాంటి రచయిత్రులు మాత్రమే వ్రాయగలరేమో. ఈ పుస్తకానికి మకుటమైన 'అవతలివైపు'లో ఇంతకు ముందే చాలా కథలకి వస్తువులైన - అసూయ, పశ్చాత్తాపం - వీటినే మనసుని కదిలించే కథగా తీర్చిదిద్దారు. కథ పూర్తయే సరికి ఒక్కసారి మనల్ని మనం వెనక్కితిరిగి చూసుకుంటాం. సహజీవనం, డబ్బు సంపాదనా వేటలో ఇద్దరూ ఉద్యోగాలు చేసే భార్యాభర్తలు - ఇలాంటి ఆధునిక సమస్యలని ఆలోచింపచేసే దిశలో రచయిత్రి వ్రాసిన తీరు అభినందనీయం. ఈ సంపుటిలోని 30 కథల్లో ప్రతిదీ దేనికదే ప్రత్యేకంగా నిలుస్తుంది. శ్రీపతిగారు ముందు మాటలో చెప్పినట్లు " ఈ కథల సంపుటిలో జీవనదృశ్యాలు ప్రధానంగా స్త్రీ దృక్కోణం నుంచి కుటుంబ అనుబంధాలు, సమాజ బాంధవ్యాలు ఇతివృత్తాలు కావడం వల్ల పాఠకులు ఆ పాత్రలతో మమేకం అవుతారు".

కాలక్షేపానికి కాక మనసుని తట్టిలేపే కథలని హృద్యంగా అందించిన రచయిత్రికి అభినందనలు.

***

**For Copies:**

***Sripada Swatee***
16-2-701/D/2
Upstairs, Anand Nagar Colony,
Malakpet, Hyderabad - 500 036
Ph : 040-6581 1258
Email: swatee53@gmail.com




**ఇటీవల కాలంలో** విరివిగా కథలు, కవితలు వ్రాస్తున్న ప్రవాసాంధ్ర రచయిత్రి శ్రీమతి కోసూరి ఉమాభారతిగారు. కేవలం సంవత్సరం వ్యవధిలోనే 30కి పైగా కథలు, వ్యాసాలు, కవితలు వ్రాశారు. అవి వివిధ పత్రికల్లో ప్రచురింపబడడం కూడా అభినందించదగ్గ విశేషం. అందులో డజను పైగా కథలే ఉన్నాయి. ఆ కథలన్నీ గుదిగుచ్చి ఒక సంపుటిగా మనకందించారు ఉమాభారతిగారు. ఉమాభారతిగారు రచనా ప్రపంచంలోకి అడుగిడే సరికే కూచిపూడి నృత్యకళాకారిణిగా, నాట్య గురువుగా, నటిగా, నిర్మాతగా, దర్శకురాలిగా.. ఎంతో పేరు తెచ్చుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా పలువురి ప్రశంసలందుకున్నారు. ఇప్పుడు రచయిత్రిగా కూడ మంచిపేరు తెచ్చుకుంటున్నారు. అభినందనలందిస్తూ ముందుమాటలో డా.పుట్ల హేమలతగారు ‘ఉమాభారతి పాతతరం మనస్తత్వం ఉన్న కొత్తతరం రచయిత్రి‘ అని రచయిత్రి కథన శైలిని క్లుప్తంగా, స్పష్టంగా తెలియచేశారు. చాలా కథల రచనాశైలి, వాక్య నిర్మాణం కూడ అలనాటి కథలని గుర్తుచేయడమే ఇందుకు నిదర్శనం. ఇందులోని కథలన్నీ ఏదో ఒక సందేశాన్ని నింపుకున్నవే. కొన్ని కథలకి ఆయా కథల్లోని ముఖ్యాంశాన్ని రచయిత్రి కథ చివరలో స్పష్టంగా తెలియచేశారు. ఉదా: నిస్వార్థ కృషితో, ఇతరుల జీవితాలలో శాంతిసంతోషాల వెలుగులు నింపిన ఓ త్యాగమయి గాధ! ; భర్త నిరాదరణ సహించలేక గడపదాట నిశ్చయించిన ఓ నిస్సహాయ, నాటితరం మహిళ అంతర్మధనమే ఈ కథనం. ఈ వివరణలవల్ల రచయిత్రి చెప్పదలచుకున్న విషయాన్ని పాఠకులు సులువుగా గ్రహించగలుగుతారు. రచయిత్రి పరిసరాలకి, చుట్టూరా ఉన్న వ్యక్తుల మనస్తత్వాలకి, మానవ సంబంధాలకి సునిశితంగా ప్రతిస్పందిస్తారనడానికి ఆమె ఎన్నుకున్న కథాంశాలే ప్రత్యక్షసాక్ష్యాలు. వాక్యనిర్మాణం కూడ సూటిగా సరళంగా సాగింది.‘త్రిశంకు స్వర్గం‘,‘మా నాన్న పిచ్చివాడు‘..లాంటి కథలన్నీ ఎంతో ఆలోచించి వ్రాసినవి, ఆలోచనలు రేకెత్తించేవి కూడా. రచయిత్రి కలం నుంచి మరిన్ని మంచి కథలు వస్తాయని ఆశిద్దాం.

***

**_Published by:_**
**Vanguri Foundation of America**
**PO Box 1948 , Stafford , TX 77497**
**Email: vangurifoundation@gmail.com**

**_Writer Details:_**
**Kosuri Umabharathi**
**10030 Sagemark Dr**
**Houston, TX 77089;**
**ukosuri@hotmail.com**

**_Sole Distribution:_**
**Navodaya Book House,Kachiguda, Hyderabad**

**_e-book:_ www.kinige.com**

# పుస్తక పరిచయం




**సంస్కృత** సాహిత్యంలో అలంకారయుక్తంగా విషయాలని వివరించడానికి ఉదహరించే కొన్ని ఉపమాన పూరిత వాక్యాలని 'న్యాయాలు' అనికూడా పిలవడం అలవాటు. అటువంటి కొన్ని సంస్కృత న్యాయాలని ఎంపికచేసుకుని వాటి అర్థాన్నే కాక వెనుకనున్న పరమార్థాన్ని కూడా వివరించారీ పుస్తకంలో రచయిత 'విద్వాన్' తిరుమల పెద్దింటి నరసింహాచార్యులుగారు. వీరు గతంలో ఆంధ్ర భాషోపన్యాసకులు కూడా కావడం వల్ల ఈ వ్యాస రచన అతి సరళంగా, అందరికీ అర్థమయే రీతిలో సాగింది. అవసరమైన చోట ఉపనిషత్తులనుంచి, పురాణాల నుంచి ఉదాహరణలను తీసుకుని చిన్న చిన్న కథలతో ఈ సంస్కృతన్యాయాల వెనుకనున్న ఆధ్యాత్మిక విశేషాలని అందించారు రచయిత. ఆయా న్యాయాలని ఆధునిక జీవన విధానాలకి కూడా అన్వయించడం ఈ వ్యాసాల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. భ్రమర కీటక న్యాయం, మర్కట కిశోర-మార్జాల కిశోర న్యాయాలు, శాఖా చంక్రమణ న్యాయం, అంధ కరదీపికా న్యాయం, చర్వితచర్వణ న్యాయం, గగన కుసుమ న్యాయం, హంసక్షీర న్యాయం.. ఇందులో వివరించబడిన న్యాయాలలో కొన్ని. వీటిలో కొన్నింటిని తరచూ తెలుగు కథల్లోనూ, వ్యాసాల్లోనూ కూడా చూస్తుంటాం. వాటిని ఎక్కడ వాడాలో తెలుసేమోకానీ, వాటి వెనుకనున్న అంతరార్థం అందరికీ తెలియకపోవచ్చు. ఆ వివరాలు తెల్సుకోడానికి ఈ పుస్తకం సహకరిస్తుంది. కొన్ని చోట్ల రచయిత ఇచ్చిన వివరణలు (ఉదా.రజ్జు సర్పభ్రాంతి న్యాయం, అంధ కరదీపికా న్యాయం..) అసలు అర్థానికి కాస్త దూరంగా ఉన్నట్లు అనిపించవచ్చు. ఐనా చెప్పేవి మంచి విషయాలు కాబట్టి పాఠకుడిని చివరివరకూ చదివిస్తాయి. ఇలాంటి సరికొత్త ప్రయోగాన్ని చేసిన రచయిత విద్వాన్ తిరుమల పెద్దింటి నరసింహాచార్యులుగారు అభినందనీయులు.

***

**For Copies:**

**Smt T.P.Vijayalakshmi**
**49-14-8 Lalitha Nagar**
**Visakhapatnam – 530 016**
**Phone: 739 615 8897**




*For Copies:*
**Palagummi Ramakrishna Rao**
**Plot# : 101, Door# : 13-92**
**Gowtam Nagar Colony**
**Meerpet Post**
**HYDERABAD – 500 097**

**Cell Number: 9441735834**
**rkpalagummi@gmail.com**

జ్యోతిషం, సంఖ్యాశాస్త్రం, వాస్తు శాస్త్రం ..లాంటివి మూఢనమ్మకాలని, శాస్త్రీయ ఆధారాలకి అవి నిలవలేవని కొన్ని వాదనలు ఉన్నా, ఈ అంశాలని నమ్మేవారూ, వాటిని అభ్యసించి ఆచరించేవారూ, బోధించేవారు చాలా మందే ఉన్నారు. ఆయా అంశాలని కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో బోధనాంశాలుగా కూడా కొనసాగిస్తున్నారు. జ్యోతిషశాస్త్రం ఆధారంగా పాలగుమ్మి రామకృష్ణారావుగారు వ్రాసిన ఈ పుస్తకం ‘మీ జాతకాన్ని మీరే పరిశీలించుకోండి‘ ఈ తరహా గ్రంధాల్లో ప్రత్యేకమైనదని చెప్పవచ్చు. ముందుమాటలో రచయిత ‘నేను ఈ గ్రంథం వ్రాయడానికి ముఖ్య కారణం నాలుగు సంవత్సరాల కాలం జ్యోతిష విద్యార్థిగా విద్యాభ్యాసంలో ఎదుర్కొన్న ఇబ్బందులు‘ అని పేర్కొన్నారు. ఈ అంశాలని శాస్త్రీయంగా అభ్యసించి, ఆచరిస్తున్న అనుభవజ్ఞుడిగా రామకృష్ణారావుగారు ఈ పుస్తకాన్ని సవివరంగా సరళమైన భాషలో తీర్చిదిద్దారు. రచయిత సాంఘిక కథ, నవలా రచయిత కూడా అవడం వల్ల ఈ పుస్తక రచనా శైలి సూటిగా ఆసక్తికరంగా సాగింది. ఇందులో ద్వాదశ రాశులను, గ్రహ కారకత్వాలను తేలిగ్గా అర్థం చేసుకోడానికి వీలుగా పది పేజీల నిడివిగల ఒక గల్పికతో ప్రారంభించారు. జ్యోతిషం గురించి వాడుకలో ఉన్న చాలా గ్రంధాలు అనుభవజ్ఞులకి మాత్రమే అర్థమయే రీతిలో ఉంటున్నాయి. అలా కాక జ్యోతిషం మీద ఏమాత్రం అవగాహన లేని వారికి సైతం ఆ శాస్త్రంలో అవగాహనని పెంచి మిగతా గ్రంధాలు అర్థం చేసుకోవడానికి గట్టి పునాది ఈ పుస్తకం వేస్తుందని రచయిత చెబుతున్నారు. ఇంకా ఈ గ్రంథంలో వివాహ ముహూర్త నిర్ణయాలలో ప్రాథమిక అంశాలని కూడా పొందుపరిచారు. గోచార ఫలితాలని ఎవరికి వారే విశ్లేషించుకునే పద్ధతులని కూడ రచయిత వివరంగా చెప్పారు. జాతక చక్ర నిర్మాణంలో పద్ధతులు, గ్రహదశలు, జాతక పరిశీలనలో గ్రహదశల ఆవశ్యకత..లాంటి అధ్యాయాలతో కూడిన ఈ పుస్తకం యొక్క ఉపయోగాన్ని రచయిత స్పష్టంగా తెలియచేశారు‘ ఎవరేది చెప్పినా నమ్మడం కన్నా తమంతట తాము తెలుసుకోవాలనే కోరిక బలంగా ఉన్న వ్యక్తులకు ఈ పుస్తకం ఒక మంచి మార్గాన్ని ఇస్తుందని నమ్ముతున్నాను‘ అని. రచయిత ఆశయం సఫలం కావాలని ఆశిద్దాం.

# పుస్తక పరిచయం




**రాసిలో** తక్కువైనా వాసి గల కథలు వ్రాసే రచయిత్రి నాదెళ్ళ అనూరాధ గారు. కాలేజీ రోజులనుంచి వ్రాస్తున్నా, గత పాతికేళ్ళుగా పత్రికల్లో ప్రచురింపబడుతున్నా, ప్రయోజనకరమైన కథలు మాత్రమే వ్రాయాలనుకోవడం వల్లనేమో అనూరాధగారు వ్రాసిన కథల సంఖ్య తక్కువే. ఐనా ప్రతికథనీ ఓ ఆణిముత్యంలా తీర్చిదిద్దిన నేర్పు రచయిత్రిది. ఒక్కటంటే ఒక్కటి కూడా కాలక్షేపానికి వ్రాసిన కథ లేదీ సంపుటిలో. 21 కథలు ఉన్న ఈ పుస్తకంలో కథారచనా కాలం 1982 నుంచి 2012 వరకూ ఉంది. సహజంగానే కాలంతో మారిన సామాజిక విలువలు, మానవసంబంధాల్లో వచ్చిన మార్పులూ ఈ కథల్లో ప్రతిబింబిస్తున్నాయి. ఈ కథల్లో అత్యధికశాతం స్త్రీ జీవితాన్ని, స్త్రీ మనస్తత్వాన్ని, కుటుంబ బంధాల్లో స్త్రీకున్న పాత్రనీ వివిధకోణాల్లో విశ్లేషించిన కథలే. ఉద్యోగం చేసే స్త్రీలు పక్కవాళ్ళతో మాట్లాడ్డాన్నే అదోలా చూసే మనుషులు (మబ్బుతునక-1985), పోటీపరీక్షలకి తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్న అమ్మాయిలు (తీర్పు-2002), గూడువిడిచి వెళ్ళిపోయిన కన్నవాళ్ళందరనీ ఒక్కచోట చూసుకోవాలని తపించే అమ్మానాన్నలు (ఒక సందర్భం-2010) - ఇంకా ఎంతోమంది మన మధ్యలో ఉన్న వ్యక్తులూ, మన చుట్టూ ఉన్న మనుషులూ కనిపిస్తారు ఈ కథల్లో. ప్రతి కథలోనూ అంతర్లీనంగా ఒక సందేశమో, విశ్లేషణో ఉంది. ఇరవయ్యేళ్ళ క్రిందట వ్రాసిన కథల్లో ఇవి సూటిగా కనిపిస్తే (సరిపడని సూత్రాలు - 1992), ఇటీవల వ్రాసిన కథల్లో ఇవి చక్కటి శిల్పంలో ఒదిగి సుతిమెత్తగా మనసుల్ని కదిలిస్తాయి. అన్ని కథలూ ఒక పంథాలో సాగితే చిట్టచివరి కథ 'నాస్టాల్జియా' అందమైన కవితలా సాగింది. మొత్తం మీద ఈ కథా సంపుటి చదవడం పూర్తికాగానే మంచికథలు చదివిన తృప్తి కలుగుతుంది. రచయిత్రి కలంనుంచి మరిన్ని ప్రయోజనాత్మకమైన కథలు రావాలని ఆశిద్దాం.

***

**For Copies:**

**Nadella Anuradha,**
Flat No.102, Block D,
Vasanthnagar, Poranki,
**VIJAYAWADA - 521 137**
Ph : 0866 2583196, 73860 98516
e-mail : tukusgm@gmail.com




*For Copies :*
**K. Murali Mohan**
9111, Block 9A,
Janapriya Mahanagar, Meerpet,
Hyderabad 500 097.
Ph: 9701371256
& All Leading Book Sellers in AP
For Online Purchase & e-Book
www.kinege.com

ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ప్రచురణకర్తలు ఇలా అన్నారు ” ‘ఇలాంటి వ్యక్తి ఈ భూమ్మీద నడయాడాడంటే భావితరాలకు నమ్మకం కుదరదు‘ అని మహాత్మాగాంధీ గురించి వ్యాఖ్యానిస్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నాడు. సర్దేశాయి తిరుమలరావుగారి గురించి తెలుసుకుంటుంటే కూడా మనసులో ఇదే ఆలోచన మెదులుతుంది”. ఈ విలక్షణ పుస్తకం చదవడం పూర్తికాగానే ప్రచురణకర్తల మాటలతో పూర్తిగా ఏకీభవిస్తాం. తిరుమలరావుగారి లాంటి విలక్షణమైన వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఎంతో ప్రతిభా పాటవాలు ఉన్నా చరిత్రలో వీరికి సరైన స్థానం లేకపోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. వృత్తిరీత్యా తైలపరిశోధనా శాస్త్రవేత్త. ప్రవృత్తిరీత్యా సాహితీ విమర్శకుడు. ఇలాంటి కలయిక చాలా అరుదుగా కనిపిస్తుంది. వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ కూడా ఎన్నో ప్రత్యేకతలని సాధించడమనేది చరిత్ర గుర్తించాల్సిన విషయం. తైల పరిశోధనా రంగంలో దాదాపు నాలుగు వందల పరిశోధనా పత్రాలని ప్రచురించారు. అమెరికన్ కెమిస్టు సొసైటీలో 30 సంవత్సరాలపాటు సభ్యునిగా ఉండి, ఎమెరిటస్ మెంబర్ స్థానాన్ని పొందిన భారతీయుడు తిరుమలరావుగారు ఒక్కరే. వృత్తిలో ఇంత బిజీగా ఉండేవారికి వేరే వ్యాపకాలకి సమయం దొరక్కపోవడం సహజం. ఐతే తిరుమలరావుగారు సాహితీ విమర్శనా రంగంలో కూడ ఇంత విశేషమైన కృషి చేశారు. వివిధ కలంపేర్లతో వెయ్యికి పైగా సాహిత్యవ్యాసాలు వ్రాశారు. విమర్శనా గ్రంధాలు వ్రాశారు. ఇంక ఈ పుస్తక రూపకల్పన విషయానికి వస్తే - రచయితలు డా.నాగసూరి వేణుగోపాల్, కోడీహళ్ళి మురళీమోహన్ గార్లు విశేషమైన కృషి చేశారు. సర్దేశాయి తిరుమలరావుగారి గురించిన సమస్త సమాచారాన్ని అత్యంత శ్రద్ధతో సేకరించి పుస్తకరూపం కల్పించారు. నిజానికి ఇలాంటి బృహత్కార్యక్రమాలు ఏ విశ్వవిద్యాలయం స్థాయిలోనే జరగాలి. కానీ రచయితలు వ్యక్తిగత శ్రద్ధతో ఈ పుస్తకాన్ని రూపొందించిన తీరు శతధా హర్షణీయం. ఇందులో తిరుమలరావుగారు వ్రాసిన విలువైన వ్యాసాలతో బాటు, ఆయన విలక్షణ వ్యక్తిత్వం గురించి వివిధ రచయితలు వ్రాసిన వ్యాసాలని కూడా పొందుపరిచారు. పుస్తకానుబంధంలో తిరుమలరావు గారి రచనలు ప్రచురించబడిన పత్రికలు, తేదీలు, పేజీల వివరాలను కూడా అందించారు. వీరి కృషి పరిశోధనా గ్రంధస్థాయికి ఏ మాత్రం తీసిపోదు. ముందుమాటలో చెప్పినట్లు ఈ పుస్తకం స్ఫూర్తితో ఇలాంటి చరిత్రకందని ప్రత్యేక వ్యక్తుల గురించిన పుస్తకాలు మరిన్ని రావాలని, అవి ఈనాటి తరానికి మార్గదర్శకాలు కావాలని ఆశిద్దాం.

★★★★



# పుస్తక పరిచయం

## రంగుటద్దాల గది

యు.ఎ. నరసింహమూర్తి

**విజయనగరంలో** నివసిస్తున్న విశ్రాంత ఉపన్యాసకులు శ్రీ యు.ఎ.నరసింహ మూర్తిగారు, తెలుగు సాహితీలోకానికి చిరపరిచితులే. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల గురించి ఎన్నో సాహితీ విశ్లేషణా వ్యాసాలు వ్రాశారు. చాలావరకూ పుస్తకరూపంలో కూడ వచ్చాయి. కన్యాశుల్కం వచ్చిన రోజుల్లో భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అదే కథాంశంతో వ్రాయబడిన పరభాషా నాటకాల గురించి నరసింహమూర్తిగారు చేసిన పరిశోధన తెలుగు సాహితీప్రియులనెంతగానో ఆకట్టుకుంది. ఆయన వ్రాసిన మరొక విశిష్ట గ్రంధం ఈ 'రంగుటద్దాల గది'. విజయనగరానికి వన్నెతెచ్చిన సాహితీ, కళాకారుల గురించిన వ్యాససంపుటి ఈ పుస్తకం. ఇందులో విజయనగరంలో జీవించిన వారున్నారు. చదివిన వారున్నారు. బంధువులున్న వారున్నారు. అటువంటి విశిష్ట వ్యక్తుల గురించి వర్తమాన తరానికి, భ్యవిష్యత్ తరాలకు కూడా తెలియచేయాలనే సదుద్దేశంతో రూపుదుద్దుకున్నదీ పుస్తకం. 'ఆధునికత- గురజాడ' తో మొదలైంది ఈ వ్యాససంపుటి. గురజాడగారి గురించి చాలా ఆసక్తికరమైన సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. గురజాడగారి గురించి చాలా తక్కువమందికి తెల్సిన 'నీలగిరి పాటలు' రెండో అధ్యాయం. ఇదొక విలువైన పరిశోధనా వ్యాసం. అక్కడనుంచి మొదలై ఆధునిక కాలంలోని పతంజలిగారి వరకూ వివిధ సాహితీకారుల గురించిన అరుదైన సమాచారం ఇందులో ఉంది. ఆదిభట్ల నారాయణదాసు, మల్లాది విశ్వనాథ కవిరాజు..ప్రభృతుల గురించి ఈ తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వ్యాసాలు కేవలం విషయ సేకరణా దృష్టితోనే కాక, విశ్లేషణా కోణంలో కూడ సాగడం వల్ల ఇవి విజ్ఞానదాయకంగా, ఆలోచనాత్మకంగా కూడా ఉన్నాయి. ఈ ఉత్కృష్టమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా పూర్తిచేసిన రచయిత శతధా అభినందనీయులు. ఈ పుస్తకం అతిత్వరలో ప్రముఖ పుస్తకాల దుకాణాలన్నింటిలో అందుబాటులోకి రాబోతోంది.

***

**Published by**
U. A. NARASIMHAMURTHY
8-30-7,
Sainagar, Thotapalem
Vizainagaram-535 003.

**Copies**: At all leading Book Shops




*Published by :*
**Sri Vedagiri Communications**
1-8-59/1/7, Chikkadpally
Hyderabad 500 020.
Ph: 939 134 3916

*Copes Available at:*
Navodaya Book House

దాదాపు 50 సంవత్సరాలుగా తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోనూ రచయితగా చిరపరిచితమైన ప్రముఖులు శ్రీ విహారి( జె.ఎస్.మూర్తి). ఆయన వివిధ పత్రికల్లో వివిధ కథల గురించి వ్రాసిన పరిచయాలు, పరామర్శలలో ఓ వంద వ్యాసాలని గుదిగుచ్చి ఈ సంపుటిలో అందించారు. ఈ వ్యాసాల ప్రత్యేకత ఏమిటంటే - ఇవి సమీక్షలూ కావు, పరిశీలనలూ కావు. విహారిగారు ముందుమాటలో చెప్పినట్లే ఒక రచయితగా, పాఠకుడుగా ఆయన చదివిన కథానికల్లో కొన్నింటి గురించి ఆయన గమనించిన 'ప్లస్ పాయింట్లు' విశదంగా వ్రాశారు. వీటిల్లో ఎక్కడా చీల్చి చెండాడడమూ, రచయిత ఎక్కడ విఫలమయ్యాడు, రచయిత ఇంకా ఎలా రాసి ఉంటే బావుండేది ..అనే రంధ్రాన్వేషణలు ఉండవు. ఇదొక విధంగా విలక్షణమైన ప్రక్రియ. ఏ రచనలోనైనా ఒకరికి నచ్చిన అంశం మరొకరికి నచ్చాల్సిన అవసరం లేదు. అలాగని ఆయా రచనల్లోని మంచిని వదిలేసి కేవలం లోపాలని ఎత్తి చూపించడమే విమర్శ అనిపించుకుంటున్న రోజుల్లో ఇలా 'మంచి'ని మాత్రమే పరిచయం చేసిన విహారిగారిని అభినందించాలి. ఇది ఒక విధంగా చాలా ఆరోగ్యకరమైన విధానం. కొత్తగా చదవాలనుకుంటున్న పాఠకులకి ఒక పోజిటివ్ కోణాన్ని పరిచయం చేస్తాయీ వ్యాసాలు. విహారిగారు స్వతహాగా రచయిత కూడా కాబట్టి ఆయన ఒక్కో కథనీ, రచయితనీ పరిచయం చేసేవిధానం కూడా ఆసక్తికరమైన కథలాగే సాగుతుంది. శైలి మాత్రమే కాక ఆయా పరిచయాలకి పెట్టిన శీర్షికలు కూడా భావస్ఫోరకంగా ఉన్నాయి. ఈ పుస్తకం తొలి అధ్యాయంలో ఆరుగురు మహా రచయితలకి స్మృత్యంజలి ఘటిస్తున్న ఆరు వ్యాసాలున్నాయి. గురజాడగారి నుంచి మొదలుకుని ఆధునిక కథా రచయితలైన ఖదీర్ బాబు, కె.వి.నరేందర్ వరకూ వందమంది వ్రాసిన కథలని సానుకూల దృక్పథంతో పరిచయం చేసిన విహారిగారు అభినందనీయులు. కథా రచయితలుగా కొనసాగుతున్న వారు, కథా రచయితలు కాదలచుకున్న వారు, కథా ప్రియులూ అందరూ చదవాల్సిన పుస్తకం ఇది. ఇంత మంచి పుస్తకాన్ని ప్రచురించిన శ్రీ వేదగిరి కమ్యునికేషన్స్ వారిని కూడా ఈ సందర్భంలో అభినందించి తీరాలి.

★★★★

# పుస్తక పరిచయం




***Writer***
Kondamudi Saikiran Kumar
E-303, Bhagirathi Complex
Rameshwadi
Badlapur (w)-421 503
Thane District, Maharashtra
Cell: +91 9702911151
Res: (0251) 2673153

**వచనకవిత్వానికి** ఎన్ని తూనికరాళ్ళు, ప్రమాణాలు నిర్వచించబడినా - అంతిమంగా పాఠకుల హృదయాలని స్పృశించి, కదిలించి, ఆ హృదయాల్లో నిలిచిపోయేదే అసలైన సిసలైన కవిత్వం. ఎంతమంది పాఠకులని చేరగలిగితే అంతకాలం నిలిచిఉంటుంది ఆ కవిత్వం. పుంఖాను పుంఖాలుగా వచన కవితలు వస్తున్నా ఈ రోజుల్లో సొంత గొంతుకని పలికిస్తూ, తనకంటూ ఒక ప్రత్యేకతని నిలుపుకోవడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. ఈ ప్రక్రియని విశిష్టమైన రీతిలో ఒడిసిపట్టి ఆధునిక వచన కవిత్వంలో తనకంటూ ఒక శైలినీ, శిల్పాన్నీ అలవరచుకున్న కవి కొండముది సాయికిరణ్ కుమార్‌గారు. ఒకటో రెండో కవితలు తప్ప ఏ కవితా పది , పదిహేను పంక్తులని మించి ఉండదు. అతి చిన్న నిర్మాణంలో అనల్పమైన అర్థాన్ని పొదగాలంటే ప్రతి పదానికీ, ప్రతి వాక్యానికీ ఒక తూకం ఉండాలి, ఒక కాలిక్యులేషన్ ఉండాలి. ఇది కూడా ఈ కవితలలోని ప్రత్యేకతే. అలవోకగా చదివి, వదిలేసే కవితలో, లయబద్ధంగా సాగి అర్థంతో సంబంధం లేకుండా 'అద్భుతం' అనిపించే కవితలో కావివి. పదాడంబరం కంటే భావగర్భితమైన అల్లిక ఈ కవితల విశిష్టత. ఒక్కసారి చదివిన వెంటనే అర్థం కాకపోవచ్చు. అలాగని చెప్పినదేమిటో కవికి మాత్రమే తెలిసేంతటి 'యాబ్‌స్ట్రాక్ట్' కవిత్వం కూడా కాదిది. చదివినకొద్దీ చదవాలనిపించే లోతైన భావ సంపద ఈ కవితల ప్రత్యేకత. ఒక్కసారి అంతరార్థం తెలియగానే కవి గొప్పదనం 'ఆహా' అనిపిస్తుంది. ఈ కవితల్లోని భావాలన్నీ 'చీకటి అద్ది వెళ్ళిన నక్షత్రాలే' అనడంలోనే కవి తనంటే ఏమిటో చెప్పకనే చెప్పారు.

'మట్టిలో కలిసే మబ్బు వాసన' ' మబ్బుల్లో పుట్టి / మట్టిలో పొర్లాలనుంది' లాంటి ప్రయోగాలు సాయికిరణ్‌గారి కవితా సంతకానికి మచ్చుతునకలు. 'ఎక్కడెక్కడి పిట్టలో / ఎగిరొచ్చి వాలతాయి / ఆశల ధూపంలో / తడారబెట్టుకుందుకు/ ఫౌంటేన్ చిమ్మినట్లు / చెట్టు విసిరికొడుతుంది / పిట్టల్లా ఆలోచనలు / ఆకాశంలోకే మళ్ళీ..' ఎంత చక్కటి, చిక్కటి భావన! ఈ అసలైన కవిత్వాన్ని చదివి పలవరించకుండా ఉండడం అసాధ్యం. మళ్ళీ మళ్ళీ చదివిన కొద్దీ కొత్త అందాలు స్ఫురిస్తాయి.

ముందు మాటలో ఇక్బాల్ చంద్‌గారన్నట్లు 'నేటి ఆంధ్రదేశంలో కుప్పలు తెప్పలుగా కుకవిత్వపు తుఫాను రేగుతున్న ఈ కాలంలో తొలకరి సువాసనల తాజాదనంతో కిరణ్ కవిత్వం వినిపిస్తున్నాడు'. చదివి, దాచుకుని, చదవాలనిపించే ఈ కవితలని చదివిన కవితా ప్రియులందరూ ఇక్బాల్ చంద్‌గారి మాటలతో ఏకీభవిస్తారు.

*****




**క్రియాశీలక** రాజకీయాల్లో నిరంతరం నిమగ్నమై ఉండే శ్రీమతి నందమూరి లక్ష్మీ పార్వతిగారి సాహితీ పార్శ్వం గురించి చాలా తక్కువమందికి తెలిసి ఉంటుంది. ఉభయభాషా ప్రవీణ పట్టా పొంది, ఎమ్.ఫిల్, డాక్టరేట్‌లు కూడా సాధించారు లక్ష్మీపార్వతిగారు. ఎన్టీ.రామారావుగారి గురించిన పుస్తకాలే కాక, చారిత్రాత్మక నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా వ్రాశారు. వీరు వ్రాసిన పుస్తకాలన్నీ అతి కొద్ది కాలంలోనే పునర్ముద్రణకి రావడం , పాఠకుల్లో ఆ రచనలకున్న ఆకర్షణని తెలియచేస్తుంది. ఆమె వ్రాసిన విలక్షణ కవితా సంపుటి ఈ ‘ఆద్యంతాలు‘. ఈ పుస్తకానికి ముందు మాటలో ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ గారు ” జీవన సత్యాలు చర్మ చక్షువులకు కనిపించవు. అనుభవాల అగ్నిజ్వాలల్లో దగ్ధమై ఆధ్యాత్మిక జన్మనెత్తిన జీవుడి కాంతిమయ నేత్రాలకే కనిపిస్తాయి ------- ఆమె మన చర్మచక్షువులు చూచే ఆమె కాదు. ఆమెలో ఉన్న ఆమె ఒక విరాణ్మూర్తి ” అన్నారు. ఇందుకు నిలువెత్తు సాక్ష్యాలు ఈ పుస్తకంలోని కవితలు. యాభైకి పైగా ఉన్న ఈ కవితలు దాదాపు అన్నీ వివిధ పత్రికల్లో ప్రచురితమైనవే. ఈ కవితల్లో వస్తు వైవిధ్యతే కాక శైలిలో కూడా చాలా వినూత్నత కనిపిస్తుంది. ఉపరితలంలోనే విస్పష్టంగా అర్థాన్ని వివరించే కవితలు కొన్ని ఐతే, లోతైన భావాలని పొదుగుకున్న సాగరగర్భంలోని రత్నాల్లాంటి కవితలు మరికొన్ని. భావకవితలు కొన్ని, జీవన సత్యాలను వేదాంతధోరణిలో తెలియచెప్పే కవితలు మరికొన్ని. ”ముసురు పట్టిన ఈ సాయంత్రం / నీవు ముందే వస్తావని / తలుపులు తెఱచే వుంచాను / మూయని గది తలుపుల్లా / నా కనురెప్పలు తడి బరువుతో తటపటాయిస్తున్నాయి” అంటారు ‘ఎదురు చూపు‘ అనే కవితలో. ”ద్వారబంధమున చేతులాన్చి / గగనాంతరాళమున చూపులు నిగిడ్చి / నిరీక్షించుచుంటి / ఈ యుగ విగళమ వేళనైనా వత్తువేమోనని ” అంటూ చక్కటి శబ్ద సౌందర్యంలో అర్థాన్ని పొదుగుతారు. ”అనుభవాలన్నీ / ఒడిదుడుకుల తీరలో కట్టిన / ఇసుకగూళ్ళలో జీవచ్ఛవాల్లా పడిఉన్నాయి / అనుభూతుల రంగుల్లో / ఊపిరి దిద్దుకున్న ఆశల చిత్రం / ముగింపుగా / వృద్ధాప్యపు రంగు అద్దుకుంటోంది ” అని ఓ కవితలో చెబితే ”శునకం ఆత్మకథ‘ అనే మరో కవితలో రోడ్డు ప్రమాదాల్లో కన్నుమూసే శునకాల గురించి హృదయాలు కదిలించేలా వ్రాస్తారు. ఈ ‘ఆద్యంతాలు‘ సంపుటి, ఒక స్థాయి గల కవితా పుష్పాల పుప్పొడి.

*****

*Published by :*
**NTR Educational Society**
**Banjara Hills**
**HYDERABAD**

# పుస్తక పరిచయం




**Publishers**
Arts & Letters
#1-2-365/25/C
Domalguda, HYDERABAD – 500 029

**Writer:**
Sai Papineni
Phone: 98450 34442
andhranagari@gmail.com

**తెలుగులో పుస్తకప్రచురణ** ఏమాత్రం లాభసాటి వ్యాపారం కాదనీ, అసలు తెలుగు పుస్తకాలు చదివే పాఠకుల సంఖ్య అతి దారుణమైన స్థాయికి పడిపోయిందనీ అందరూ అంగీకరిస్తున్న ఈ రోజుల్లో - 'ఆంధ్రనగరి' లాంటి చారిత్రాత్మక నవలని వ్రాయడం, ప్రచురించడం చాలా సాహసోపేతమైన పని. కాల్పనిక నవలలు ఐతే, ఒకచోట కూర్చొని, మనసుతో ఆలోచించి, పాత్రలనీ, సన్నివేశాలని అల్లుకుంటూ ఓపికున్నంత మేరా రాసుకుంటూ పోవచ్చు. కానీ చారిత్రాత్మక నవలల్లో అలాంటి సౌలభ్యం ఉండదు. చారిత్రాత్మకం అంటేనే చరిత్రని ప్రతిబింబిస్తూ, అలనాటి వాస్తవాలకి కొంచెం కాల్పనికతని జోడిస్తూ నవలా రూపంలో వ్రాయాలి. ఇదొక సర్కస్ ఫీట్ లాంటి వ్యవహారం. ముందుగా చరిత్రమీద పట్టు ఉండాలి, చాలా పరిశోధన చెయ్యాలి, ఆ పైన సరళమైన శైలిలో దానికి కథా రూపం ఇవ్వాలి. ఇలాంటి ప్రక్రియలన్నింటిలో ఈ 'ఆంధ్రనగరి' రచయిత సాయి పాపినేని సమగ్రమైన విజయం సాధించారని నిస్సందేహంగా చెప్పవచ్చు. పాతికేళ్ళుగా ఆంధ్రదేశానికి దూరంగా ఉన్న కారణంగా సరైన తెలుగు వ్రాయలేనేమోనని సందేహించానని రచయిత ముందు మాటలో పేర్కొన్నారు కానీ ప్రస్తుతం తెలుగులో వస్తున్న అనేక నవలలకన్నా ఉత్తమమైన శైలిలో సాగింది ఈ కథా రచన. ఎక్కడా రచయిత కిది ప్రథమ ప్రయత్నం అనిపించదు. ఇద్దరు మిత్రులు, కృష్ణానదీ తీరంలోని అమరావతిని సందర్శించడనికి నాగార్జునా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఓ ఆర్కియాలజీ ప్రొఫెసర్‌ని కలుపుకుని అక్కడకి వెళ్ళడం, ఓ పది గంటలపాటు వాళ్ళక్కడి విశేషాలని, చారిత్రక శిధిలాలని చూస్తూ గడపడం - ఆ క్రమంలో దొర్లిన సంభాషణల్లో - క్రీ.పూ. మూడవ శాతాబ్దంలో కృష్ణా నదీమతల్లి ఒడిలో వికసించి తర్వాత వెయ్యేళ్ళపాటు ఆసియా ఖండమంతా విస్తరించిన నాగరికత గురించిన వివిధ సంఘటనలు, చారిత్రాత్మక వాస్తవాలు - వీటి కథా రూపం --ఇదీ స్థూలంగా ఇందులోని కథ. అమరావతి చరిత్ర కేంద్రంగా ఈ కథ అల్లబడినా, కథానుగుణంగా శాతవాహనుల చరిత్ర, ఆగ్నేయాసియాలోని ఆంధ్ర రాజ్యాలు, ఆంధ్రప్రదేశ్‌లోని బౌద్ధకేంద్రాలు, గౌతమీపుత్ర శాతకర్ణి పాలించిన మహాంధ్ర సామ్రాజ్యం..లాంటి అనేక ఆసక్తికరమైన అంశాలని కథలో చొప్పించారు. వేల సంవత్సరాల క్రిందటి సంఘటనలకి కథా రూపం ఇచ్చేప్పుడు, అలనాటి వాతావరణాన్ని పాఠకుల కళ్ళముందు నిలబెట్టేందుకు రచయిత ఎంచుకున్న రచనా శైలి అత్యంత ప్రశంసనీయం. ఇది ఒక చరిత్ర పుస్తకం, ఒక నవలా గ్రంథం. సందర్భానుసారం కథకి సంబంధించిన చారిత్రక వాస్తవాలని బాక్స్ ఐటమ్స్‌గా అందించడం కూడా చాలా బావుంది. ఓ చక్కటి ప్రయత్నానికి అత్యంత అందమైన రూపం ఈ 'ఆంధ్రనగరి'. ఈ పుస్తకాన్ని చదువుతున్నంత సేపూ మనం కూడా వెయ్యేళ్ళ క్రిందటి ఆయా ప్రదేశాల్లో , సంఘటనల్లో పర్యటిస్తాం. రచయిత సాయి పాపినేని కృషి పదికాలాలు నిలిచిపోతుంది.

*****

**సరైన కోణంలో** చూస్తే ప్రతి మనిషి జీవితంలోనూ ఎంతో కొంత స్ఫూర్తి ( నేర్చుకోదగినవి కొన్నీ, నేర్చుకో కూడనివి కొన్నీ!) కనిపిస్తుంది. మామూలు వ్యక్తుల జీవిత పరిధి, వాళ్ళకి పరిచయమున్న వ్యక్తుల వరకే. అదే సినిమా వ్యక్తుల విషయానికి వస్తే వాళ్ళ జీవిత పరిధి చాలా ఎక్కువ. ముఖ్యంగా సినిమాల్లో ప్రముఖంగా పేరుతెచ్చుకున్న వాళ్ళ గురించి తెలుసుకోవాలని ఆసక్తి లేని వాళ్ళుండరంటే అతిశయోక్తి కాదేమో. తెలుగు చలన చిత్రరంగంలో హాస్యనటుడికి హీరో హోదా కలిగించిన మొట్టమొదటి నటుడు రేలంగిగారు. 'రేలంగోడు' గా కొన్ని దశాబ్దాలపాటు తెలుగు సినీ ప్రేక్షకులకి వినోదాన్ని పంచిన రేలంగి వెంకట్రామయ్యగారి జీవిత చరిత్ర ఈ పుస్తకం. చిన్నప్పుడే నాటకాల పట్ల విపరీతమైన మోజు పెంచుకుని, దాన్నొక వ్యసనం చేసుకుని చదువుకి కూడా స్వస్తి చెప్పారు రేలంగిగారు. ఆ క్రమంలో ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోయారు కొన్ని రోజులు. సి.పుల్లయ్యగారి ప్రాపకంతో సినీరంగంలోకి అడుగు పెట్టారు. దాదాపు 15 సంవత్సరాలు తెరవెనుక వివిధ రంగాల్లో పనిచేసిన రేలంగికి 40 సంవత్సరాల వయసులో 1950 ప్రాంతాల్లో హాస్యనటుడిగా బ్రేక్ వచ్చింది. ఆ తరువాత అంతా చరిత్రే. చివరి రోజుల్లో తీవ్రమైన అనారోగ్యం పాలైనప్పుడు కూడా నటనని వదిలిపెట్టలేదు. నటనని చివరి క్షణం వరకూ శ్వాసించిన నటుడు రేలంగిగారు. వ్యక్తిగా కూడా ఎన్నో దానాలు చేశారు. ఎప్పుడో మరణించిన ప్రముఖుల జీవిత చరిత్ర వ్రాయడం అంటే అంత తేలికైన పనికాదు. వారు బతికున్న రోజుల్లో జరిగిన సంఘటనలని వివివరించాలంటే అప్పటి పత్రికలే ఆధారం. పాత సినిమా పత్రికలు, కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారం ఆధారంగా టి.ఎస్.జగన్మోహన్‌గారు వ్రాసిన పుస్తకం ఇది. చాలా సరళమైన భాషలో వీలైనంతవరకూ ఎక్కడా క్రమం తప్పకుండా రేలంగిగారి జీవిత విశేషాలని నవలీకరించి మనకందించారు  రచయిత. వీటితో పాటుగా రేలంగి నటించిన అనేక చిత్రాలలో ఆయన పాత్రలని వివరంగా విశ్లేషించడం కూడా ఈ పుస్తకం ప్రత్యేకత. అరుదైన చిత్రాలూ, నాణ్యమైన ముద్రణా ఈ పుస్తకానికి అదనపు అలంకారాలు. కేవలం సినీ ప్రియులనే  కాక సాధారణ పాఠకులని కూడా ఆసక్తికరంగా చదివించే పుస్తకం ఈ 'హాస్యనట చక్రవర్తి రేలంగి'.

*****

.




**Publishers**
Creative Links
1-8-725/A/1, 103C
Balaji Bhagyanagar Apartments
Nallakunta, HYDERABAD – 500 044

**Writer:**
T.S. Jaganmohan
Phone: 040-27640744

# పుస్తక పరిచయం




***Publishers***
Vamsee Cultural & Educational Trust, India

Vanguri Foundation of America,
PO Box # 1948, Stafford, TX 77497
Phone: 832 594 9054
Email: vangurifoundation@gmail.com

**చాలా విషయాల్లో** పరిమితుల గురించి, పరిధుల గురించి కొన్నికొన్ని అభిప్రాయాలు ప్రజల్లో నాటుకుపోయి ఉంటాయి. అందుకు కారణాలు ఉండొచ్చు కానీ, చాలా మంది విశ్లేషణకు పోకుండా ఆయా పరిమితుల్ని, పరిధులని అలాగే నమ్మేసి వాటిని అధిగమించడానికి వీలౌతుందేమో అన్న ఆలోచనవైపు కూడా వెళ్ళరు. "ఈ కాలంలో యువతరం అత్యంత వేగంగా పరుగులుతీస్తోంది. ముఖ్యంగా ఆంధ్రదేశంలోని యువతీ యువకులంతా పోటీపరీక్షలు, కెరీర్ మీదనే కేంద్రీకరిస్తున్నారు కానీ సాహిత్యం, కళలు ..ఇలాంటి వాటిగురించి అస్సలు ఆసక్తి చూపించడంలేదు" - ఇదీ ఒక సిద్ధాంతం. ఇందులో అబద్ధమేం లేదు. ఐతే కొంతప్రయత్నంచేసి తెలుగుసాహిత్యం మీద ఆసక్తి, ప్రతిభ వున్న యువతీ యువకుల్ని సమీకరించగలమా, ఒక్కచోట చేర్చగలమా.. అని విభిన్నంగా ఆలోచించారు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు. తమ ఆలోచనని ఆచరణలో పెట్టి 'ఇది సాధ్యమా!?' అని అందరూ ఆశ్చర్యపోయేలా చేశారు. మొన్న సెప్టెంబర్ 29వ తేదీ నుంచి అక్టోబర్ 5వరకూ హైదరాబాదులో మొట్టమొదటి జాతీయ యువసాహితీ సమ్మేళనాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. 'కొంతమంది యువకులు..పావన నవజీవన బృందావన నిర్మాతలు' అన్న శ్రీశ్రీ వాక్యాలను సాకారం చేస్తూ కేవలం 15 - 35 సంవత్సరాల వయసుగల రచయిత, రచయిత్రులని ఒకచోట చేర్చి వారంపాటు సాహితీ సభలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న యువతీ యువకులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై "తెలుగు సాహిత్యానికి మంచి రోజులున్నాయి, మేమంతా అందుకు నిదర్శనం" అని ఎలుగెత్తిచాటారు. ఆ సాహితీ వారోత్సవంలో పాల్గొని పదిమందితో పంచుకున్న ఆ రచనలని ఒక పుస్తకరూపంలో ప్రచురించిన వంగూరి ఫౌండేషన్ కృషిని, కార్యదీక్షని ఎంత ప్రశంసించినా సరిపోదు. ఇందులోని రచనలన్నింటిలో ఎంతో పరిణితి కనిపిస్తోంది. కథలు, కవితలు, వ్యాసాలు, గేయాలు, విశ్లేషణలూ -- అన్నీ ఏ లబ్ధప్రతిష్ఠులైన రచయితల రచనలకీ తీసిపోవు. ఇందులోని రచనలన్నింటినీ ముందుగానే సేకరించి కార్యక్రమాలు పూర్తయే సరికే వాటికి గ్రంథరూపం కలిపించడం కార్యకర్తల నిబద్ధతకి నిలువెత్తు నిదర్శనం. రచయితల ఛాయాచిత్రాలు, సంక్షిప్తపరిచయాలు కూడా చేర్చి ఉంటే మరింత నిండుదనం సమకూరేది. తెలుగుసాహితీరంగంలో అనేక వినూత్న కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు పరుస్తున్న, వంగూరి ఫౌండేషన్ సారథి, చిట్టెన్ రాజుగారు, ఇండియా కార్యక్రమాల సమన్వయకర్త వంశీ రామరాజుగారు ఎంతైనా అభినందనీయులు.

***

**శిఖరాలనధిరోహించడమే** కాదు, పడిపోయిన లోయల్లోంచి పైకి రావడం కూడా విజయమే. ఎవరితోనో పోటీపడి గెలవడమే కాదు, తనని తాను తెలుసుకుని సవ్యమైన జీవనమార్గన్ని ఎన్నుకోవడం కూడా విజయమే. కష్టాలూ, కన్నీళ్ళూ, బాధలూ, బరువులూ.. జీవితంలో భాగమే ఐనా వాటిని తట్టుకుని నిలబడడమే ముఖ్యం. ఇబ్బందులు ఎదురైనప్పుడు పరిస్థితులనో, ఇంకెవరినో నిందించడం చాలా తేలికపని. జరిగిన వాటన్నింటికీ బాధ్యత వహించి పొరబాట్లని సర్దుకునే స్వయం విశ్లేషణ, ఆత్మావలోకనం పెంపొందించుకోవడం ..అదొక కళగా చెప్పుకోవచ్చు. అలాంటి కళని జీవితంలో భాగంగా చేసుకుని, జీవితం చూపించిన చేదు అనుభవాలన్నింటినీ వ్యక్తిత్వ వికాస పాఠాలుగా మలచుకున్న ఒక మహిళ కథ ఈ ఆంగ్లపుస్తకం ‘Butterfly, Journey from my Cocoon‘. ఇది కాల్పనిక కథ కాదు, నిజంగా జరిగిన కథ. ఎవరికో జరిగిన కథకాదు రచయిత్రి ఆత్మకథ. పైచదువులకోసం అమెరికా వచ్చారు రచయిత్రి. వివాహం ఐన సంవత్సరానికే bone-marrow disorder వ్యాధి పంజా విసిరింది. రెండేళ్ళపాటు మృత్యువుతో హోరాహోరీ పోరాడారు. అత్యంత భయంకరమైన, బాధాకరమైన వైద్యవిధానాలని తట్టుకుని మృత్యువుని ఓడించారు. మళ్ళీ మామూలు మనిషిగా మారాక వైవాహిక జీవితంలో ఒడుదుడుకులు, కలవని అలవాట్లు, సర్దుబాటుకాని మనస్తత్వాలు. బాబు పుట్టిన కొద్ది నెలలకే ఒంటరి తల్లిగా మరో ప్రయాణం.. – ఇవన్నీ రచయిత్రికి జీవితం చూపించిన అనుభవాల పరంపర. కేవలం ఇది రచయిత్రి కథ మాత్రమే అనిపించదు, ఆమె విశ్లేషించిన పరిస్థితులు, వాటిల్లోంచి తను తేరుకున్న విధానం ఎన్నో ఆలోచనలు రేకెత్తిస్తుంది. పుస్తకం చదువుతున్నంత సేపు రచయిత్రితో పాటు మనమూ ప్రయాణించి, ఆ ఒడుదుడుకుల్ని మానసికంగా అనుభవించి, చివరికి జీవితం నేర్పే పాఠాలతో బయటికి వస్తాం. వ్యక్తిగత జీవితంలో ఎదురైన భయంకరమైన ఒత్తిళ్ళని సానుకూల దృక్పథంతో తాను ఎదుర్కొన్న వైనాన్ని, రచయిత్రి ఎంతోమందికి ఉపయోగకరమయ్యేలా వివరించారు.

***




*Published By*

Tough Times Never Last Publishing
Little Rock, Arkansas, USA



# పుస్తక పరిచయం




**పదిమందిలో కలిసిపోయి** నడవడం అంత కష్టమేం కాదు. గుర్తింపూ అలానే ఉంటుంది, 'మందిలో ఒకడు' అన్నట్లు. అందరిలో ఉంటూ ప్రత్యేకంగా కనిపించాలంటే విలక్షణమైన ప్రజ్ఞ ఏదో ఉండాలి. శ్రీ అరిపిరాల సత్యప్రసాద్ తనదైన సొంత శైలితో కథారచయితగా ప్రత్యేకమైన ముద్రవేశారని ఈ సంపుటిలోని ప్రతికథా నిరూపిస్తుంది. తెలుగు పాఠకుల సంఖ్య తగ్గిపోయిందనీ, పత్రికల సర్క్యులేషన్ పడిపోయిందనీ అంకెలూ, విశ్లేషణలూ నిరూపిస్తున్నాయి. కానీ తెలుగు కథా రచయితల సంఖ్యమాత్రం తగ్గలేదని అచ్చుపత్రికలూ, అంతర్జాల పత్రికలూ, బ్లాగులూ ఋజువు చేస్తూనే ఉన్నాయి. ఒక కథ చదవగానే ఇది వినూత్నంగా ఉంది, ఇది ఫలానా రచయితదే అని ఖచ్చితంగా చెప్పగలిగిన సొంత సంతకాన్ని ఏర్పరచుకున్నారు రచయిత సత్యప్రసాద్ గారు. కథాంశంలో పెద్ద మలుపులు, గాఢమైన సన్నివేశాలు లేకపోయినా, కథ చెప్పే విధానంతో ప్రత్యేకత తీసుకొచ్చారు రచయిత. ఇద్దరు యువ భార్యాభర్తలు, ఉద్యోగాల్లో నిచ్చెనమెట్లు ఎక్కడానికి నిత్య ఘర్షణ, చివరికి భర్త ' మనలోని మనిషితనాన్ని' అణచివేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి లెక్చరర్ ఉద్యోగానికి వెళ్ళాలనుకోవడం. - చెప్పుకుంటే ఇంతే కథాంశం. ఐతే - అర్థరాత్రి మెలకువతో చీకటిలో జారిపోయిన కలతో మొదలై పచ్చటి వసంతాన్ని ఆవాహన చేయడంతో ముగిసిన కథ - దీన్ని 'ఊహాచిత్రం' అనే కంటే 'కవితా చిత్రం' అంటే బావుంటుంది.! మరోసారి వెనక్కి వెళ్ళి 'అవునూ.. ఈ అంశాన్ని ఇంత సున్నితంగా, కవితాత్మకంగా ఎలా చెప్పారు?' అనే విషయం తెలుసుకోవాలనిపిస్తుంది. ఏ వాక్యం ఎంతవరకూ ఉండాలో, ఏ వర్ణన ఎంత మేర ఉండాలో ఆచితూచి ఓ శిల్పం చెక్కినట్లుగా వ్రాశారు ప్రతి కథనీ. ' తుది బంధం', ' ఏడు తర్వాత' , 'చినుకులా రాలి'.. మనసుని మృదువుగా స్పృశించి కరుణరసానికి చక్కటి ఉదాహరణలుగా నిలుస్తాయి. ఏ కథలోనూ నినాదాలు, వాదాలూ, ఇజాలు లేవు. ప్రతికథా మనసుతో వ్రాసినది, మనసుని కదిలించేందుకు వ్రాసినది అనిపిస్తుంది. ముందుమాటలో వసుంధరగారు చెప్పినట్లు ఈ కథల్లో అలనాటి చలం నుంచి ఈ నాటి యండమూరి వరకూ కనిపించినా తనదైన బాణీని మాత్రం రచయిత వదులుకోలేదు. సత్యప్రసాద్‌గారి కలంనుంచి మరిన్ని మంచి కథలు నిరంతరం వస్తుండాలని ఆశిద్దాం.

*****

**Published by:** Gna Prachuranalu
**Copies:** In all leading book stores
**e-books:** www.kinige.com

**Writer:**
satyaonline@gmail.com
+91 9966907771




తెలుగుసినిమా మాటలు నేర్చిన కొత్తలో నాలుగైదేళ్ళ వరకూ పౌరాణికాలే ఎక్కువగా వచ్చాయి. వాటికి మాటలు, పాటలు వ్రాయడం అంటే మూలకథల్లోంచో, నాటకాల్లోంచో తీసుకునేవారు. 1936 ప్రాంతాల్లో సాంఘిక చిత్రాలు మొదలైనప్పుడు సినిమా భాష ఎలా ఉండాలి అనే విషయం మీద దర్శకులు, రచయితలు ఎలాంటి చర్చలు చేశారో తెలీదు కానీ తెలుగులో రెండో సాంఘిక చిత్రమైన గృహలక్ష్మి నుంచే పాటలు, మాటల రచయితగా చిత్రరంగ ప్రవేశం చేసిన (అంతకు ముందు కనకతారలో కొన్ని పాటలు వ్రాశారు) సముద్రాల రాఘవాచార్యగారు తెలుగు సినిమా సంభాషణలకి, పాటలకి ఒక చక్కటి ఒరవడిని ప్రవేశపెట్టారు. ఎలాంటి భాష ప్రేక్షకుడుకి నచ్చుతుంది అనే విషయంలో ఆయన వేసిన పునాదుల మీదే మిగతా కవులంతా సినీభాషా సౌధాన్ని నిర్మించారు. ఎన్నో ప్రత్యేతకతలు కలిగిన సముద్రాల రాఘవాచార్యగారి పాటల వైభవాన్ని మూడు సంపుటాల్లో వెలువరించారు రచయిత డా.వి.వి.రామారావుగారు. ఆయన చేసిన కృషి అత్యంత ప్రసంశనీయమైనది. సముద్రాలగారి సంక్షిప్తజీవన చిత్రణతో ప్రారంభించారు మొదటి భాగాన్ని. తర్వాత సముద్రాలవారు మాటలు, పాటలు వ్రాసిన అన్ని చిత్రాల వివరాలని వరుసగా పొందుపరిచారు. పాటలన్నింటి సాహిత్యాన్ని పూర్తిగా ఇవ్వడమే కాక ప్రతి పాటనీ సంగీతపరంగా, సాహిత్య పరంగా విశ్లేషించారు. రచయిత స్వతహాగా కవి, గాయకుడు, సంగీతకర్తా కావడం వలన ఆయన వివరణలన్నీ సాధికారికంగా ఉన్నాయి. ప్రతి చిత్రానికి కథా సంగ్రహాన్ని., చాలా చోట్ల ఆయా సినిమాల ప్రత్యేకతలని, నేపథ్యకథనాలని వివరించడం కూడా పాఠకులకి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి. అరుదైన చిత్రాలు ఈ పుస్తకానికి అదనపు అలంకారాలు. ఇటీవల కాలంలో, తెలుగు సినిమాకి రూపురేఖలు నిర్ణయించిన తొలితరం కళాకారుల గురించి, సాంకేతిక నిపుణుల గురించి అధిక సంఖ్యలో పుస్తకాలు రావడం ఎంతైనా సంతోషించదగ్గ విషయం. సముద్రాల గురించి ఇంత సమగ్రమైన సమాచారాన్ని అందించిన రచయిత డా.వి.వి.రామారావుగారు అభినందనీయులు.

*****

***Writer:***
Dr.V.V.Rama Rao
H.No. 43, LIC Colony
Lower Tank Bund Road, Indira Park
HYDERABAD – 500 080
Cell: 984 923 7663

# పుస్తక పరిచయం




**Published by:**
Rushi Publications
Main Road, Hanuman Peta
VIJAYAWADA – 520 003
Phone: 0866 - 2577388

**లోకానికి వెరచి** సీతదేవిని రాముడు అడవికి పంపించేశాక ఆమె వాల్మీకి ఆశ్రమంలో ఆశ్రయం పొందడం, కవల పిల్లల జననం, కొన్నాళ్ళకి రాముడు అశ్వమేథయాగం నిర్వహించిన సందర్భంలో లవకుశులు రాముడ్ని కలుసుకోవడం, అదే సమయంలో సీతదేవిని పిలిచి నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశాన్ని ఇవ్వడం, తరువాత సీతాదేవి ఆత్మార్పణం చేసుకోవడం - ఈ కథని చాలామంది చాలా కోణాల్లో చూపిస్తూ వివిధ కళరూపాల్లో చిత్రీకరించారు. సినిమాలు, నాటకాలు, నృత్యనాటికలు, రేడియో నాటికలు చాలా వచ్చాయి. ఇంక గ్రంధాలవిషయానికైతే చెప్పనవసరంలేదు. ఐతే ఈ సంఘటనలన్నింటినీ సీతాదేవి కోణంలో చూస్తూ ఆయా సందర్భాల్లో ఒక స్త్రీగా ఆమె భావాలు ఎలా వుండి వుంటాయి, ఆమె ఎంత మానసిక క్షోభకి లోనై ఉంటుంది .. - ఇలా ఊహిస్తూ చిత్రీకరించిన నవల ఈ వైదేహి. తన మొదటి నవల 'శ్రమణకం' తోనే విమర్శకుల ప్రశంసలని పొందిన డా.నందమూరి లక్ష్మీపార్వతి రచించిన ఈ నవల క్రిందటి సంవత్సరమే 'ఆంధ్రభూమి ' ఆదివారం సంచికలో సీరియల్‌గా వచ్చింది. సీరియల్‌గా వస్తున్నప్పుడే పాఠకులని, ముఖ్యంగా మహిళా పాఠకులని, విశేషంగా ఆకట్టుకుంది. క్రిందటినెలలోనే దీన్ని పుస్తకరూపంలో కూడా ప్రచురించారు. అందరికీ తెల్సిన కథే ఐనా సన్నివేశ చిత్రణ, సంభాషణలు ఈ నవలకి ఆయువుపట్టు. చదువుతున్నంత సేపూ మనసు ముంగిట్లో ఓ దృశ్యమాలిక కదలాడుతుంది. అన్నింటినీ మించి వైదేహి మానసిక చిత్రణ అద్భుతమైన స్థాయిలో కొనసాగింది. మచ్చుకి ఓ సందర్భం. లవకుశులతో సమయం గడుపుతున్నప్పుడు శత్రుఘ్నుడు వచ్చాడని తెలుసుకున్న వైదేహికి గతం గుర్తొస్తుంది. ఆ సన్నివేశంలో రచయిత్రి ఇలా వ్రాస్తారు "ఆమె కంటి కొసల్లో నిలిచిన నీటిచుక్క నిలిచిపోనా జారిపోనా అని అడుగుతున్నట్లనిపించింది. రగులుతున్న అవమానాగ్ని నుండి నువ్వెలా వచ్చావో నాకర్థం కావటం లేదు. క్రిందకు జారితే ఆత్మాభిమానం దెబ్బతింటుంది. ఆగిపో చెలీ..! నువ్వు నా గుండెలోనే ఉండిపో. ఆర్ద్రీభూతమైన నీ చెలిమి చెమ్మే కదూ నాకు ఓదార్పు..". నవలలో అడుగడుగునా సీతాదేవి మానసిక స్థితిని చిత్రించే ఇలాంటి వాక్యాలు ఎన్నో కనిపిస్తాయి. పుస్తకం చివరి అట్టమీద "ప్రకృతి నుంచి ఆవిర్భవించిన పంచభూతాలు, తిరిగి మాతృవ్యవస్థ మీదికే దాడి చేసినట్టు - స్త్రీ గర్భంలో జన్మించిన పురుషుడు స్త్రీలమీదనే పెత్తనం సాగిస్తున్నాడు. తరాలు గడిచినా స్త్రీ అశ్రువేదనలోని అంతరార్థం ఒక్కటే - నాటి వైదేహి నుంచి నేటి నిర్భయ వరకూ జరుగుతున్న చరిత్ర ఇదే. సీత పాత్రలోని ఔన్నత్యాన్ని వైశిష్ట్యాన్ని మరో కోణంలో ఆవిష్కరించిన వైవిధ్యమైన నవల" అని వ్రాశారు. పుస్తకం చదవడం పూర్తయ్యాక పాఠకులు ఈ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తారు.

*****




**రచన సుదీర్ఘమైతే** రచయితకి వెసులుబాటు ఉంటుంది. తాను చెప్పదలచుకున్న విషయానికి ఎంత కాన్వాసు అవసరమైతే అంత కాన్వాసు ఉపయోగించుకోవచ్చు. అదే రచనా నిడివి తగ్గితే, తక్కువలో వ్రాయాలన్న నియమాన్ని పాటించాల్సి వస్తే రచయితకి అదొక సవాలే! కవితారీతుల్లో హైకూల పరిస్థితి ఇదే. మూడు పంక్తుల్లో భావాన్ని పలికించాలంటే, అందులోనూ ఒక 'పంచ్' కనిపించాలంటే రచయిత సృజనాత్మకత చురకత్తిలా ఉండాలి. ఎంచుకునే అంశం, చెప్పే విధానం, పదాల కూర్పు, కొసమెరుపూ అన్నీ సమపాళ్ళలో ఉంటేనే ప్రక్రియ సఫలమౌతుంది. వృత్తిరీత్యా వైద్యులైన డా.రమణ యశస్విగారు ఈ 'మిణుగురులు' కవితా సంకలనంలో తన ప్రతిభని ప్రశంసనీయంగా ప్రదర్శించారు. ప్రకృతి, పరిసరాలు, అనుబంధాలు, స్నేహాలు, మానసిక స్థితులు, భావోద్వేగాలు.. అన్నింటినీ తన హైకూల్లో కవితా వస్తువుగా చేసుకున్నారు రచయిత. లైఫ్ బుక్కులో / సంతోషపు ఘడియలు / కామా గుర్తులు ; గుండె గాయాలు / మాట్లువేస్తున్న కాల / మహిమ ఘనం ; అద్దం తీరిగ్గా / తీస్తున్నది మనసు / పొరల మర్మం - లాంటి కవితల్లో జీవన వేదాంతాన్ని ధ్వనిస్తే - ఉత్తరాల్లేవు / బొత్తాల్లేని లాగు / పోస్టాఫీసులో ; మనసు సీడీ / ప్రేమ సాఫ్ట్‌వేర్ తో / రీ రైటబుల్ / రాత్రి కలలో / నా కంప్యూటర్ మౌస్ / ఎక్కిరిస్తోంది - లాంటి కవితల్లో చెణుకులని గుప్పించారు రచయిత. మంచి ప్రయత్నాన్ని పదిమంది మెచ్చుకునేలా పూర్తిచేసిన రచయిత డా.రమణగారు అభినందనీయులు.

*****

*Writer:*
Dr.Ramana Yashaswi
Yashasvi Hospitals
Kakani Road, GUNTUR – 522 001
Cell: 98480 78807

# పుస్తక పరిచయం




**డా.ఇన్నయ్యగారు** 'కౌముది' పాఠకులకు చిరపరిచితులే. గత సంవత్సరంగా 'సాహితీ మిత్రులతో సహవాసం' అనే శీర్షికని వ్రాస్తున్నారు. మానవవాది, హేతువాది, ప్రముఖ జర్నలిస్ట్ డా.ఇన్నయ్యగారి 75సంవత్సరాల జీవనప్రస్థానానికి పుస్తకరూపం ఇది. సిద్ధాంతాలు ప్రవచించేవారిని చూస్తుంటాం, సిద్ధాంతాలని నమ్మేవారిని చూస్తుంటాం.. ఇందులో చాలా మంది జీవితంలో ఎదురయ్యే వివిధ సంఘటనలకి ప్రభావితులై ఒకప్పుడు నమ్మిన సిద్ధాంతాలకి తిలోదకాలివ్వడమో, రాజీ పడిపోవడమో కూడా జరుగుతుంది. నమ్మిన విలువలకోసం ఎక్కడా రాజీ పడకుండా జీవించడం ఇన్నయ్యగారి లాంటి అతికొద్దిమందికి మాత్రమే సాధ్యమౌతుంది. హేతువాదం కానీ, మానవవాదం కానీ కేవలం ప్రసంగాలకి, రచనలకి పరిమితం చేయకుండా తను చేపట్టిన ప్రతికార్యక్రమంలోనూ అమలు చేసిన, చేస్తున్న ప్రత్యేక వ్యక్తి శ్రీ ఇన్నయ్యగారు. ఆయన 75సంవత్సరాల జీవితంలో ఎన్నో కష్టాలు చూశారు, ఎంతో మంది ప్రముఖులతో కలిసి పనిచేశారు, ఎన్నో పుస్తకాలు వ్రాశారు, అనువాదాలు చేశారు, ఎంతో మందితో విభేదాలు వచ్చాయి, పోరాడాల్సిన సంఘటనలు ఎదురయ్యాయి, భౌతికంగా దాడులు జరిగాయి –అయినా ఎక్కడా తడబడలేదు, వెనుకంజ వెయ్యలేదు. నమ్మిన బాటలో ప్రయాణాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. షిర్డీసాయి గురించి, పుట్టపర్తి సాయిబాబా గురించి, వివేకానందుడి గురించి, మదర్ థెరిసా గురించి, ఇంక అనాకానేక బాబాలు, మాతల గురించి –ధైర్యంగా ఎన్నో నగ్నసత్యాలని బయటపెట్టారు. కేవలం వ్రాతలకే పరిమితం కాకుండా హైదరాబాదులో ఉబ్బసం కోసం పంచే చేపమందులోని విశ్వసనీయతగురించి ఉద్యమం చేశారు. కోర్టుకి వెళ్ళారు. ఆ వివరాలన్నీ ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజకీయనాయకులు, మానవవాదులు, రచయితలూ, సామాజిక సేవాకార్యకర్తలు.. ఇంకా ఎంతో మంది ప్రముఖులతో కలిసి పనిచేసినప్పటి తన అనుభవాలని చాలా నిజాయితీగా ఈ పుస్తకంలో వివరించారు. వారి అత్మకథలో ప్రతి వాక్యం, ప్రతిపేజీ, ప్రతి అధ్యాయం అత్యంత ఆసక్తికరంగా సాగుతుంది. గత 75 సంవత్సరాల్లోని అనేక రాజకీయ, సామాజిక ఉద్యమాలని ప్రతిబించే ఈ పుస్తకం అరుదైన కోవకు చెందినది. ఇన్నయ్యగారి లాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. వారు నమ్మిన విలువలు కాలానికి నిలబడి ముందు తరాలకి అందుతాయి.

***Published by:***
Emesco Books
Gaganmahal Road, Domalguda
HYDERABAD- 500 029
e-mail :
emescobooks@yahoo.com
www.emescobooks.com




**లోగడ** 'మరిగే తారుసరోవరం', 'నిప్పుల తుఫాన్' లాంటి కథా సంపుటాలు వెలువరించిన రచయిత ఎస్.గణపతిరావు గారి వాడి, వేడి కలగలిసిన కలం నుంచి వెలువడిన మరికొన్ని కథల సంపుటి ఈ 'ఇంటి మీద దుప్పటి'. పుస్తకం ముఖచిత్రం చూడగానే ఈ కథాంశాలన్ని గంభీరమైనవేనని విదితమౌతుంది. 'రేపటికోసం ఆలోచించేవారి కోసం' అని రచయిత ముందుగానే పాఠకులని సిద్ధం చేశారు. ఇందులోని కథలన్నీ సమాజంలోని, మనచుట్టు ఉన్న వ్యక్తులలోని లోపాలకి, అన్యాయాలకి, తీవ్రంగా స్పందించి వ్రాసినవి. ఈ పన్నెండు కథల్లోనూ కథాంశాలకంటే వాక్యనిర్మాణం, రచనా శైలీ విలక్షణంగా, వినూత్నంగా కనిపిస్తాయి. ప్రతి అక్షరం, వాక్యం తుపాకి మందు దట్టించినట్లు అగుపిస్తాయి. రచయిత కలంలో సిరా బదులు నిప్పురవ్వలు నింపి వ్రాసిన కథలివి. 'బూచాడొచ్చాడు' కథలో - ఎక్కడో పేపర్లో ఓ వార్త చదివాడో భర్త. రైల్లో బెర్త్ కేటయించిన టిటియి మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడని. దూరప్రయాణం నుంచి వచ్చిన భార్యని వాకిట్లోనే నిలబెట్టి అడిగాడు 'రాత్రి రైలు ప్రయాణంలో నీకు బెర్త్ కేటాయించిన టిటియి తో నువ్వేం చేశావ?'ని. అసహ్యం వేసిన భార్య అతన్ని వదిలేసి వెళ్ళిపోయింది. తనసలు రైలు ప్రయాణమే చెయ్యలేదని, బస్సులో వచ్చానని కూడా చెప్పాలనిపించలేదు. తర్వాత ఎక్కడో సదరు 'భర్త' కనిపిస్తే 'ఒరేయ్' అని పిలిచింది..!! 'భగ్గు'మన్న బొగ్గు కథలో - నిజాయితీగా బాధ్యతలు నిర్వహించే సిబిఐ అధికారిని గూండాలు విచ్చలవిడిగా నడిరోడ్డులో అవమానిస్తారు. అతి పాశవికంగా అతన్ని హింసిస్తారు. అటుగా వస్తున్న తల్లి, భార్య అతన్ని అక్కున చేర్చుకుంటారు. ఇలాంటి దౌర్జన్యాల కథలు తరచూ వార్తా పత్రికల్లో చదివేవే ఐనా రచయిత వాటిని కథా రూపంలోకి మలచిన విధానం చదువరులకి సైతం ఆవేశాన్ని రగిలిస్తుంది. అంత ప్రభావం కలిగించే శైలి రచయితది. 'దద్దమ్మల్లా 'స్వార్థమ్మలు' తయారయ్యి చెరుకు రసంలా జాతిని గడగడా తాగేసి పిప్పి చేసి విసిరి కొడుతుంటే రాజ్యాంగం దిక్కులేనిదానిలా చూస్తోంది..' అనే అంశంచుట్టూ అల్లిన ఓ కొవ్వెక్కిన వ్యాపారి దుష్టచర్యలకి ప్రతిరూపం 'ఇంటిమీద దుప్పటి'. 'ఈ కథలన్నీ మీరు ఓపోసన పట్టేస్తే గుండెనెత్తురులో మీరూ పాళీలు ఊరబెడతారు' అన్న విశ్వాసాన్ని వ్యక్తంచేసిన రచయిత నిజాయితీని మెచ్చుకోకుండా ఉండలేము.

*Writer:*
**S.Ganapathi Rao**
# 31, North Boag Road
T Nagar, CHENNAI – 600 017
Phone: 91- 917 628 2903
91- 965 229 4856

# పుస్తక పరిచయం




**అమెరికాలోని** ప్రవాసాంధ్ర రచయితల్లో తనదైన విలక్షణ శైలి, కథాంశాలతో ఒక ప్రత్యేకతని నిలబెట్టుకుంటున్న రచయిత శ్రీ జె.యు.బి.వి.ప్రసాద్. ఆయన ప్రచురించిన తన రెండో కథల సంపుటి ఈ 'పెళ్ళాల పులి'. లోగడ ఈ రచయితే ప్రచురించిన తన మొదటి కథల సంపుటి ' ఆ కుటుంబంతో ఒక రోజు' విమర్శకుల, పాఠకుల ప్రశంసలనందుకుంది. 'పెళ్ళాల పులి' సంపుటిలో కథలతో పాటు రచయిత అప్పుడప్పుడూ వ్రాసిన వ్యాసాలు కూడా ఉన్నాయి. ఈ కథల్లోనూ, వ్యాసాల్లోనూ విశిష్టంగా కనిపించేవి 'విశ్లేషణ, ఆలోచన'. ఏ రచనా, ఏదో వ్రాయాలని వ్రాసినట్లు ఉండదు. అది కథైనా వ్యాసమైనా రచయిత ఒక ప్రయోజనన్నాశించి వ్రాసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. రచయిత వెలిబుచ్చిన భావాలతో ఏకీభవించినా, విభేదించినా, ఏదేమైనా కానీ - ఇందులోని ప్రతి రచనా పాఠకులనైతే తప్పక ఆలోచింపచేస్తుంది. రచనా శైలికూడ ఆయా సంఘటనలని సవివరంగా కళ్ళముందు చూపిస్తుంది. ఈ సంపుటికి మకుటమైన 'పెళ్ళాల పులి' కథలో వరుస పెళ్ళిళ్ళు చేసుకునే వ్యక్తిని పరిచయం చేశారు. కథ అంతా ఒక కుటుంబ వాతావరణంలో జరగడం వల్ల చదువుతున్న పాఠకులు. ఆయా పాత్రలని ఎక్కడో చూసిన భావనకి లోనౌతారు. 'తండ్రి తనం', 'మదర్స్ డే', 'పలాయన వాదం',' గొర్రెల స్వామ్యం' కథలు ఆలోచనకి దారులు తీస్తే 'అమ్మ ఉత్తరం ', 'జీవన స్రవంతి' కథలు హృదయాన్ని తాకుతాయి. ముఖ్యంగా 'అమ్మ ఉత్తరం' కథ చదివాక 'అమ్మ'ని గుర్తు తెచ్చుకోని పాఠకులు ఉండరు. 'రావణాసురుడు' చందమామ కథలా అనిపించినా అతి చిన్న సంఘటనలో కూడ ఓ చిన్నపిల్లాడి మనస్తత్వాన్ని హృద్యంగా పొదిగారు రచయిత. రచయిత తన పరిసరాలని, తనకి ఎదురయ్యే సంఘటనలనీ, వ్యక్తుల ప్రవర్తనలనీ ఆయన చూసే విభిన్న కోణాలకి నిదర్శనంగా నిలుస్తుంది, ఈ కథా వస్తువుల్లోని వైవిధ్యం. ఇంక వ్యాసాల విషయానికి వస్తే - ఇవన్నీ రచయిత దృక్పథానికి, విశ్లేషణకి అద్దం పట్టేవే. కొన్ని వ్యాసాల్లోని సంఘటనలు కథల్లానూ గల్పికల్లానూ కూడా అనిపిస్తాయి. ఈ వ్యాసాల్లో 'నాస్తికత్వం-హేతువాదం', 'అమెరికాలో తెలుగువారి సదాచారాలు',' సినిమాలు, పుస్తకాలు, వేరే రచయితలు వ్రాసిన కథలపై, వ్యాసాలపై స్పందనలు.. ఇలా విస్తృతమైన అంశాలని స్పృశించారు. కథైనా , వ్యాసమైనా చివరివరకూ చదివించే రచనాశైలి అభినందనీయం. పుస్తకం చదవడం పూర్తయ్యాక విభిన్నమైన రచనలని చదివిన అనుభూతి కలుగుతుంది.

***

***For copies:***
Navodaya Book House
Kachiguda Chourasta
HYDERABAD – 500 027

***Writer:***
JUBV Prasad
10401, North Blaney Avenuee
Cupertino
USA, Phone: 408-202-4704
jubv@yahoo.com




**జీవితం ఒక నిరంతర స్రవంతి.** బంధాలు, అనుబంధాలు, విలువలూ..ఒక తరం నుంచి మరో తరానికి ప్రవహిస్తాయి. ఏ కుటుంబాన్ని తీసుకున్నా అటు తరాలు, ఇటుతరాలు ఉంటాయి. తాత, తండ్రి, తన సంతానం, మనుమలూ, మనుమరాండ్రూ.. అనుబంధాలు ఇలా నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ఉమ్మడి కుటుంబాలు మాయమై ఎవరికి వారౌ ఈనాటి పరిస్థితుల్లో ఏ చిన్నపిల్లాడైనా 'నాన్నా..!తాతగారి నాన్న ఎవరూ? తాతగారి తాత ఎవరూ? తాతగారు ఎలా చదువుకున్నారు?..' లాంటి ప్రశ్నలు వేస్తే జవాబులకోసం తడుముకోవాల్సిన రోజులివి. ఇలాంటి రోజుల్లో ఈ పుస్తకం చదువుతుంటే, ఒక పేజీ నుంచీ ఇంకో పేజీలోకి వెళుతుంటే ఐదు తరాల అనుబంధాలు మనసుకు హత్తుకుంటాయి. ముందు తరాలకి తెలియచేయడం గురించి తమ పూర్వీకుల గురించి కొంతమంది వ్రాసిన పుస్తకాలు అక్కడక్కడా చూశాం కానీ దాదాపు రెండొందల సంవత్సరాలనుంచి, ప్రతి చిన్న విషయాన్నీ, తమ కుటుంబంలో జరిగిన సంఘటనలని ఇంత సమగ్రంగా గ్రంథస్థం చేసిన పుస్తకం ఇదే అని చెప్పొచ్చు. నూజివీడు దగ్గర ప్లీడరుగారి తోట అంటే ఆ పరిసరాల్లో తెలీనివారు ఉండరు. ఆ ప్లీడరుగారి తోట వందెకరాల వ్యవసాయభూమి. దాన్ని దుక్కిదున్ని, సాగుచేసి వ్యవసాయ యోగ్యం చేసి బంగారు పంటలు పండించి బంధుమిత్రులకు చల్లని నీడనిచ్చిన వారు ముష్టి రామకృష్ణశాస్త్రిగారు. రామకృష్ణశాస్త్రిగారి కుటుంబంలో ఐదుతరాలకు సంబంధించిన సమగ్రమైన సమాచారం ఈ పుస్తకంలో ఆయనే వ్రాశారు. రామకృష్ణశాస్త్రి గారెవరో తెలీకపోయినా ఈ పుస్తకం చదువుతుంటే గత రెండొందల సంవత్సరాలుగా జీవన విధానాలు ఎలా వుండేవి, ఆయా కాలాల్లో సామాజిక పరిస్థితులు ఎలా ఉండేవి అనే విషయాలు చాలా ఆసక్తి కలిగిస్తాయి. రామకృష్ణశాస్త్రిగారి నాన్న, పెదనాన్నలు బ్రిటీషువారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తమ విలువైన డిగ్రీలని స్వాతంత్ర్య సమరజ్వాలలో తగులబెట్టారు. రామకృష్ణశాస్త్రిగారు బాపట్లలో వ్యవసాయశాస్త్రం చదివే రోజుల్లోనే మిస్టర్ బాపట్లగా పేరు పొందిన బాడీ బిల్డర్, మల్లయుద్ధప్రవీణులు. రచయిత్రిగా చక్కటి పేరు తెచ్చుకుంటున్న వారణాసి నాగలక్ష్మిగారు ఈయన కుమార్తె. ఈ పుస్తకంలో రామకృష్ణశాస్త్రిగారి గురించి వారి బంధువులు, మిత్రులు అనేక మంది తమ అభిప్రాయలని, ఆత్మీయతానుబంధాలని చక్కగా తెలియచేశారు. ఆయా తరాలకు చెందిన అరుదైన ఛాయా చిత్రాలు కూడా ఇందులో ఉన్నాయి.ఈ పుస్తకం చదువుతుంటే 'పరిపూర్ణజీవితం' అనే పదానికి నిజమైన నిర్వచనం కనిపిస్తుంది.

***

*Contact Details:*
**Varanasi Nagalakshmi**
85, Prim Rose, L&T Serene County
Gachibowli, Hyderabad – 500 032
Phone: 040-23003945

# పుస్తక పరిచయం




**జీవించినంత కాలం** సమాజానికి అతి సాధారణమైన, దిగువమధ్యతరగతి కుటుంబీకుడిగా మాత్రమే తెలిసిన ఈ సామాన్యుడి జీవితచరిత్ర ఈ పుస్తకం. సామాన్యుడు సమ్మాన్యుడిగా కుటింబీకుల, శిష్యుల, స్నేహితుల గుండెల్లో నిలిచిపోయిన అద్భుత గాథ ఈ జీవితచరిత్ర. అతిచిన్న వయసులో మామూలు హోమియో వైద్యుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి స్వయంకృషితో డజనుకు పైగా దేశ, విదేశీభాషల్లో ప్రావీణ్యాన్ని సంపాదించడమే కాక జీవితపోరాటంలో సంపాదనకోసమని గణితం, సైన్సు, ఆర్థికశాస్త్రం లాంటి వివిధ అంశాలని సొంతంగా నేర్చుకుని విద్యార్థులకు నేర్పిన ఒక విశిష్టవ్యక్తి గురించిన ఆశ్చర్యకరమైన విశేషాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. వినడానికి ఆశ్చర్యంగా అనిపిస్తుందికానీ ఈ పుస్తకంలో ఆయనతో పనిచేసిన, ఆయన వద్ద ట్యూషన్లు తీసుకున్న పరిచయస్తులు వ్రాసిన వ్యాసాలు ఆయన ప్రతిభకి ప్రత్యక్షసాక్ష్యాలు. కేవలం 40 సంవత్సరాలు మాత్రమే జీవించిన, 33 సంవత్సరాల క్రిందట దివంగతులైన డా.సి.వి.యోగిగారి జీవిత కథ ఈ పుస్తకం. పరిమిత ఆదాయంతో జగమంత కుటుంబాన్ని పోషిస్తూ ఎక్కడా వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా, నమ్మిన విలువలని అమ్ముకోకుండా, నిత్యం సమస్యలమయమైన జీవితంతో రాజీలేని పోరాటం సలిపిన యోధుడు డా.యోగిగారు. ఆయన వెలిగించిన జ్ఞాన రహదారిలో ప్రభవించిన మహోజ్వల జ్వాలే శ్రీ సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారు. వారి నాన్నగారి గురించి సిరివెన్నెలగారి తమ్ముడు శ్రీరామ్‌గారు వ్రాసిన విశిష్టమైన పుస్తకం ఈ 'సమ్మాన్యుడు'. ఈ పుస్తకంలో ఓ తండ్రి కొడుకుకి నేర్పిన పాఠాలున్నాయి. ఓ ఉపాధ్యాయుడు శిష్యులకు బోధించిన పాఠాలున్నాయి. ఓ భర్త భార్యకి తెలియచేసిన పాఠాలున్నాయి, ఓ కుటుంబపెద్ద బంధువులకు విశదపరచిన పాఠాలున్నాయి. ప్రతివిషయాన్నీ కేవలం బోధనద్వారా కాకుండా ఆచరించి చూపించిన స్వర్గీయ యోగిగారి జీవిత చరిత్రలో ప్రతివాక్యం ఆలోచింపచేస్తుంది, ప్రతి అధ్యాయం వ్యక్తిత్వవికాస పాఠంలా అనిపిస్తుంది.

****

*For copies:*
C.S.Satsry
501 Western Plaza, Engineers Colony
Yellareddyguda
HYDEARBAD – 500 073
Cell: 94400 66633




సాధారణంగా సాంఘికనవల, ఫిక్షన్ నవల, అంటే కుటుంబసంబంధాలు, మానవబంధాలు, కాదంటే సస్పెన్స్ థ్రిల్లర్.. ఇలా అనుకోవడం, అంచనాలు ఉండడం సర్వసాధారణం. ఐతే 'మంచి ఆలోచనలు పెంపొందించుకోండి, మంచి పనులు చేయండి' లాంటి నీతిసూక్తులతో మొదటినుంచి చివరిదాకా చదివించే నవల వ్రాయడానికి ఎంతో నేర్పు కావాలి. ఎలాంటి కథాంశాన్నైనా ఆసక్తికరమైన ఫిక్షన్‌గా మార్చగల నేర్పు ఆంధ్రుల ఆహ్లాదరచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తిగారికి మాత్రమే తెలిసిన విద్య. మల్లాదిగారి కలంనుంచి వెలువడిన ఆధ్యాత్మిక నవల ఈ 'విధాత'. ఆధ్యాత్మికత అంటే కళ్ళుమూసుకుని దైవ ప్రార్థనచేయడమో, అంతా పైవాడి దయ అనుకోవడమో కాక మంచి ఆలోచనలతో, మంచి పనులు చేయడం అని అన్వయించుకుంటే – ఈ 'విధాత' ఖచ్చితంగా ఆధ్యాత్మిక నవలే ఔతుంది. ఈ నవలలో మల్లాదిగారు 'దేవుడు' అనే భావం గురించి, కర్మ సిద్ధాంతం గురించి కూడా చాలా అధ్యాయాల్లో వివరంగా, ఆసక్తికరమైన చర్చలరూపంలో వ్రాశారు. ఆస్తికత్వం, నాస్తికత్వం – అనేవి వ్యక్తిగతమైన అభిప్రాయాలు. అందుకని ఆ చర్చలని పక్కన పెట్టి మంచితనం, మనిషితనం, మానవత్వం ఈ కోణంలో చూసినా ఈ నవల ఒక చక్కటి వ్యక్తిత్వ వికాసగ్రంథంలా అనిపిస్తుంది అనడంలో సందేహం లేదు. త్రిలోచని అనే 56 సంవత్సరాల మహిళాపారిశ్రామిక వేత్త ఈ కథలో ముఖ్యపాత్ర. అహంభావం, నిలువెత్తు గర్వం, ప్రపంచంపట్ల నిర్లక్ష్యం ఆమెకున్న సహజమైన ఆభరణాలు. అలాంటి త్రిలోచని సమస్యల వలలో చిక్కుకుని వాటిన్నంటికీ తను చేసిన పనులే కారణమని తెలుసుకుని, మంచిపనులు చేయడం వైపు ఆలోచనలని మళ్ళించుకోవడం, మంచిపనులు చేసే పథకాలని అమలుచేయడం ఈ నవలలోని కథాంశం. అవడానికి కాల్పనిక నవలేకానీ ఈ నవల చదవడం పూర్తవగానే స్పందించే పాఠకుల మనోనేత్రం ముందు సరికొత్త ప్రపంచం ఆవిష్కృతమౌతుంది. మొదటి రచన వ్రాసిన 45 సంవత్సరాల తర్వాత కూడా అంతే ఆసక్తికరంగా, అంత పదునుగానూ రచనలు చేయడం మల్లాదిగారికి మాత్రమే చెల్లిందని ఈ నవల చదివిన పాఠకులు అంగీకరిస్తారు.

****

***Published by:***
**Lipi Publications**
Gandhinagar
HYDERABAD – 500 080
telugubooks@yahoo.com
Contact : 040 – 27612244
98490 22344



# పుస్తక పరిచయం




***Published by:***
Rajachandra Foundation
482, Santhi Nagar, KT Road
Tirupathi

***Sole Distributors:***
Navodaya Book House
Opp. To Aryasamaj Mandir
Badechowdi,HYDERABAD

**"మీరు యల్లాప్రగడ సుబ్బారావు గురించి** బహుశా విని ఉండరు. కాని ఆయన జీవించాడు కనకే మీరీరోజున ఆరోగ్యంగానూ, జీవిస్తూనూ ఉండి ఉండవచ్చు. మీరు బహుశా మరింతకాలం జీవించి ఉండేందుకు ఆయన జీవించాడు" ఇవి ఒక అమెరికన్ శాస్త్రవేత్త చెప్పిన మాటలు. సకలమానవకళ్యాణం కోసం జీవితాన్ని వెచ్చించిన అద్భుతమైన మందుల మాంత్రికుడు డా.యల్లాప్రగడ సుబ్బారావు. మానవశరీరంలో భాస్వరం శాతాన్ని కనుక్కునే విధానం, ఫోలిక్ యాసిడ్ ఆవిష్కరణ, శరీరంలో శక్తి ఎ.టి.పిగా నిలువవుంటుందనే ప్రతిపాదన, టెట్రాసైక్లిన్ మందుని కనుక్కోవడం, కేన్సర్ వ్యాధి నియంత్రణలో ఉపయోగించే కీమో థెరపీకి పునాదులు వేసిన అంశాలు..ఒకటికాదు, రెండుకాదు.. బయోకెమిస్ట్రీలో ఎన్నో అద్భుత ప్రయోగాలు చేసి ఎన్నో ఔషధాలని కనుక్కోవడానికి నిరంతరం శ్రమించిన వ్యక్తి స్వర్గీయ డా. యల్లాప్రగడ సుబ్బారావు. తెలుగు నేలమీద జన్మించి, 28 సంవత్సరాల వయసులో అమెరికాగడ్డమీద అడుగుపెట్టి మరో పాతిక సంవత్సరాలపాటు అమెరికాలో భారతీయ పౌరుడిగానే జీవించి 53 సంవత్సరాల వయసులో 1948లో అమెరికాలోనే మరణించిన డా.సుబ్బారావుగారి జీవితం ఆద్యంతం స్ఫూర్తిదాయకం. అమెరికాలో నివసించిన పాతికేళ్ళలో ఒక్కసారి కూడా తిరిగి మాతృదేశానికి వెళ్ళలేదు. సొంతదేశంలో తనకోసం పాతికేళ్ళు ఎదురు చూసిన తల్లినీ, భార్యనీ చూడకుండానే ఈ లోకాన్ని వీడి వెళ్ళిన సుబ్బారావుగారి గురించి ఎక్కువమందికి తెలిసి ఉండకపోవచ్చు. ఆయన జీవిత విశేషాలూ, అమెరికాలో ఉండగా ఇండియాలో బంధు మిత్రులకు వ్రాసిన జాబులు మొదలైన ఆసక్తికరమైన విశేషాలతో రూపొందిన ఈ పుస్తకాన్ని రచించింది ప్రఖ్యాత రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి గారు. డా.సుబ్బారావుగారి ఉత్తరాలు ఆయన స్వదస్తూరిలో అంతర్జాలంలో లభ్యమౌతున్నా, వాటిలోని సారాంశాన్ని సరళమైన తెలుగులో ఒక క్రమపద్ధతిలో కథాక్రమంలో అమర్చి ఈ పుస్తకాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దారు రచయిత్రి. ఇన్ని పరిశోధనా ఫలితాల్లో ఒక్కదానికీ సుబ్బారావుగారి పేరుమీద పేటెంట్ లేకపోవడం, ఆయన కృషి తగ్గ గుర్తింపు రాకపోవడం ఒక విషాదం. ఈ పుస్తక ముఖచిత్రం మీద సుబ్బారావుగారి ఫోటోతోబాటు ఆయన భార్య, తల్లి గార్ల ఫోటోలు కూడా ఉన్నాయి. 100 పేజీల పుస్తకం చదవడం పూర్తవగానే మనసు ఆర్ద్రమౌతుంది. ఒకతెలుగువాడు ఎన్నో ప్రాణాంతకమైన మందులకి ఔషధాలు కనిపెట్టడం ఒకకోణం, ప్రపంచ మానవ సంక్షేమం కోసం జరిగిన ప్రయోగాల క్రమంలో వ్యక్తిగతజీవితాన్ని పణం పెట్టడం ఇంకో కోణం. పాఠ్యపుస్తకాలలో ఖచ్చితంగా చేర్చాల్సిన అంశం - డా.సుబ్బారావుగారి జీవిత కథనం.

****




**'భారతోపనిషత్'** అనే ఈ చిన్నగ్రంథం సంక్షిప్తభారతం లాంటిది. భారతకథలోని సారాంశాన్ని వ్యాసమహర్షి మహాభారతానికి నాందిగా వ్రాసిన కథానుక్రమణికలో పొందుపరిచారు. ఆ పీఠికలోని 122 శ్లోకాలకు అత్యంత సరళమైన అనువాదమే ఈ పుస్తకం. రచయిత రూపావతారం నారాయణశర్మగారు మూలార్థంలోని తీవ్రత, ప్రభావం ఏమాత్రం తగ్గకుండా అనువాదం చేశారు. ఈ పుస్తకం చదువుతుంటే మహాభారత కథలోని సూక్ష్మార్థాలని వ్యాసమహర్షి క్లుప్తీకరించిన విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది. మహాభారత రచన ఎలా ప్రారంభమయింది? కథయొక్క సారాంశమేమిటి? లాంటి అంశాలు ఇందులో చోటుచేసుకున్నాయి. కొండని అద్దంలో చూపించినట్లు మహాభారతం యొక్క సమగ్రస్వరూపం ఈ భారతోపనిషత్‌లో చూపించబడింది. ఈ పుస్తకానికి వ్రాసిన ముందుమాటలో డాక్టర్. తంగిరాల వెంకట సుబ్బారావుగారు ఇలా అన్నారు " భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. ఈ వేదసారం సామాన్య జనులకు కూడా అర్థం కావాలనే సదుద్దేశంతో వాల్మీకి, వ్యాసులు రామాయణ, భారతాలను రచించారు. మహాభారతానికి పంచమవేదమని పేరు. నూరు చిన్న పర్వాలతో, 18 పెద్దపర్వాలతో, సపాద లక్ష శ్లోకాలతో ఉన్న మహాభారతం యొక్క సారమంతా, చిన్న పర్వాలలో మొట్టమొదటిదైన "అనుక్రమణిక పర్వం"లో ఉంది...". ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ అనువాద గ్రంథం మహాభారత ప్రియులను ఎంతగానో అలరిస్తుంది.

****

*For copies:*
KV Sastry
#32, "SRIMATHA" SIR M.V.NAGAR
RAMAMURTHU NAGAR,
BANGALORE – 560 016
PHONE: 98864 04328



# పుస్తక పరిచయం




**జీవితం ఒక ప్రవాహం.** ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఎంతమందినో కలుపుకుంటూ సాగే నిరంతర స్రోతస్విని జీవితం. మనుషులూ, మలుపులూ, అనుభవాలూ, జ్ఞాపకాలూ.. ఏ జీవితంలో నైనా సహజమే. ఇబ్బందులూ, కష్టాలూ లేని జీవితం ఎక్కడా ఉండదు. అన్నింటినీ అధిగమిస్తూ జీవితాన్ని అందంగా అలంకరించుకోవడం కొద్ది మందికే సాధ్యమౌతుందేమో. వెనిగళ్ళ కోమలగారి 'జీవితమే నవీనం' చదువుతుంటే 'అందమైన జీవితం' అనే మాటకి సార్థకత చేకూరడమంటే ఇదేనేమో అనిపిస్తుంది. ఉమ్మడి కుటుంబంలోని ఆత్మీయతలూ, పరిసరాలూ, చిన్నప్పటి అనుభవాలూ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుతాయో తెలుసుకోడానికి కోమలగారి జీవితం ఒక ఉదాహరణ. ఓ చిన్నపిల్ల 'డాక్టర్నవుతా.. అమెరికా పోతా..' అనేది, ఆ మాటలకి అర్థాలు కూడా సరిగా తెలీని వయసులో. సంవత్సరాలు దొర్లిపోయాయి. ఆ చిన్నపిల్ల ఏమీ తెలీని వయసులో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించింది. అమెరికాలో వైద్యవృత్తిలో స్థిరపడింది. ఓ కుర్రాడు ఇంటర్మీడియట్ చదివేప్పుడు జస్టిస్ జగన్మోహన రెడ్డిగారు తన ఆటో బయోగ్రఫీ చదివి ఎలా ఉందో చదివి చెప్పమన్నారు. ఆ కుర్రాడు ఆ పుస్తకం అంతా చదివి 'మీరేమన్నా బెర్ట్రాండ్ రస్సెల్ అనుకుంటున్నారా? ఈ సోది అంతా అంతా ఎవరు చదువుతారు..ఈ వివరాలు తీసెయ్యండి' అని చెప్పాడు. ఆ కుర్రాడు పెరిగి పెద్దవాడై యంగ్ గ్లోబల్ లీడర్‌గా వరల్డ్ ఎకానామిక్స్ ఫోరమ్‌కి ఆహ్వానించబడ్డాడు. 2008లో చైనా ఒలింపిక్స్‌కి స్టేట్ గెస్ట్ - టార్చ్ బేరర్‌గా వెళ్ళాడు. అంతర్జాతీయ జర్నలిజంలో తనదైన ముద్రవేశాడు... ఈ అమ్మాయి , అబ్బాయిలని తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకి అనుగుణంగా తీర్చిదిద్దిన తల్లి వెనిగళ్ళ కోమలగారు.కోమలగారి కూతురు నవీన, కుమారుడు రాజు. భర్త డా.ఇన్నయ్యగారు ప్రముఖ హేతువాది, మానవతావాది. ఆయన ఆదర్శాలకి అనుగుణంగా ఉంటూనే సొంత భావాలని పెంపొందించుకుంటూ జీవితాన్ని కొనసాగించారు కోమలగారు. ఓపెన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన కోమలగారు చక్కటి అనువాదాలు కూడా చేశారు. మూల్పూరులో పుట్టిన వద్దనుంచి మేరీలాండ్‌లో స్థిరపడే వరకూ జరిగిన జీవితానుభవాలకి అత్యంత ఆసక్తికరమైన అందమైన పుస్తక రూపం ఇచ్చారు. ఈ జీవితచరిత్ర చదువుతున్నంత సేపూ ఎవరో ఆత్మీయురాలు తన మనసులోని భావాలని, బ్రతుకుపుటలనీ మనతో పంచుకుంటున్న అనుభూతి కలుగుతుంది. ఇటీవలే తమ 50వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న కోమల, ఇన్నయ్య గార్లు చేసిన చేస్తున్న సామాజిక సేవ ప్రశంసనీయమైనది, అనుసరణీయమైనది.

****

***Copies Available at:***
Navodaya Book House
Opp. To Aryasamaj Mandir
Kachiguda X Roads
Badechowdi,HYDERABAD

All leading book stores




***Writer:***
Dr. Akkiraju Ramapathi Rao
2-2-18/47 B-20, # 104
Sri Saikrupa Residency
DD Colony
HYDERABAD – 500 013
Phone: 27423352

**ఇరవయ్యవ శతాబ్దపు** మొదటి అర్థభాగంలో భారతదేశచరిత్రని పరిశీలిస్తే స్ఫూర్తిదాయకమైన కథనాలెన్నీ కనిపిస్తాయి. జాతీయోద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్యసమరంలో పోరాడిన మహనీయుల జీవితాలు ఎప్పటికీ ఉత్తేజపూరితంగా నిలుస్తాయి. అందులో కొంతమంది కేవలం స్వాతంత్ర్యోద్యమానికే పరిమితం కాకుండా భారతదేశ సర్వతోముఖాభివృద్ధికోసం ఎన్నో ప్రణాళికలని రచించి అమలుపరిచారు. ఒక జీవిత కాలంలో వాళ్ళు చేసిన కృషిని గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఒక్క మనిషి ఇన్ని వైవిధ్యభరితమైన రంగాల్లో ఇన్ని విజయాలని సాధించగలరా అని విస్మయం కలుగుతుంది. ఇంకా ముందుకి వెళ్ళి అలాంటి వ్యక్తుల నేపథ్యాలని పరిశీలిస్తే మరింతగా ఆశ్చర్యం కలుగుతుంది. అలాంటి కోవకి చెందిన వ్యక్తి భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు. ఆయన పేరు వినగానే ఆంధ్రాబ్యాంక్ గుర్తొస్తుంది. కానీ అంతకు మించిన చరిత్ర ఎంతో ఉంది సీతారామయ్యగారికి. ఆయన గొప్ప మేధావి. సంస్థానిర్వహణ దక్షుడు. సాంఘిక పునర్నిర్మాణ కాంక్షాశీలి. సృజనాత్మక ప్రతిభాశాలి. గాంధీజీకి ముఖ్య అనుయాయి. సలహాదారుడు. తొమ్మిదో తరగతి వరకూ చొక్కా ఎలా ఉంటుందో తెలీని బీదరికం నుంచీ వచ్చి మద్రాసు మెడికల్ కాలేజీలో ప్రథమ బాచ్‌లో డిగ్రీ అందుకున్న డా.పట్టాభిసీతారామయ్యగారు అనూహ్యమైన ఉన్నతశిఖరాలని అధిరోహించారు. మచిలీపట్నం ఆంధ్రజాతీయ కళాశాల స్థాపకుల్లో ఆయనా ఒకరు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షపదవికి జరిగిన ఎన్నికల్లో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్‌ని ఢీకొన్న ఘన చరిత్ర ఆయనది. భారత స్వాతంత్ర్య కాంగ్రెస్ చరిత్రని కేవలం జ్ఞాపకశక్తి ఆధారంగా ఏ పుస్తకాన్నీ, పత్రికలనీ పరిశీలించకుండానే కేవలం రెండునెలల వ్యవధిలో 1600 పేజీల గ్రంథంగా వ్రాయడం ఆయనకే చెల్లింది. అత్యద్భుత మేధాసంపత్తి, జ్ఞాపకశక్తి కలవాడు. ఆయన గురించిన సమగ్రమైన పుస్తకం ఎక్కడా లభ్యంకాదు. ఆయనే వివిధ సందర్భాల్లో సమావేశాలకి వెళ్ళినప్పుడు శ్రోతలు అడిగే ప్రశ్నలు వాటికి తన సమాధానాలని గ్రంథస్థం చేశారు. ఆ పుస్తకం 1946లో కలకత్తాలో ప్రచురితమైంది. వెయ్యిన్నొక్క ప్రశ్నలు వాటికి సమాధానాలు ఇందులో సంకలితమైనాయి. పట్టాభి సీతారామయ్యగారి గురించి తెలుసుకోడానికి ఈ పుస్తకమే ముఖ్య ఆధారం. అందులోనుంచి ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన 140 ప్రశ్నలని (వాటికి సమాధానాలని) ఏరి తెలుగులోకి అనువాదం చేశారు ప్రముఖ సాహితీవేత్త శ్రీ అక్కిరాజు రమాపతిరావు గారు. ఈ 80 పేజీల అతిచిన్న పుస్తకంలో అత్యంత విలువైన, అరుదైన సమాచారం ఉంది. కేవలం పట్టాభిసీతారామయ్యగారి వ్యక్తిగత జీవిత విశేషాలేకాక వివిధ రంగాలగురించి ఆయన ఊహించిన భవిష్యత్ విశేషాలు అబ్బురం కలిగిస్తాయి. ద్రష్ట అనడానికి సీతారామయ్యగారు ముందుగానే ఊహించి చెప్పిన విషయాలన్నీ ఉదాహరణలే. ప్రతివారూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. రచయిత అక్కిరాజు రమాపతిరావుగారి కృషి ప్రశంసనీయం.

****



# పుస్తక పరిచయం




**Writer:**
Dr.Vaidehi Sasidhar
1 Equinox Lane
Free hold – 07728
NJ, USA

*Avialable at:*
Visalandhra Book House – All Branches

**సొంత గొంతుకతో,** సొంత సంతకంతో అద్భుతమైన కవితలు వ్రాస్తున్న ప్రవాసాంధ్ర రచయిత్రి శ్రీమతి వైదేహీ శశిధర్‌గారు. క్లుప్తత, స్పష్టత, గాఢత వీరి కవిత్వానికున్న బలమైన లక్షణాలు. దాదాపు అన్ని పత్రికల్లోనూ తరచూ కనిపించి మనసుకి హత్తుకునే వీరి కవితల్లోని కొన్ని  ఆణిముత్యాల సంపుటి ఈ 'పునశ్చరణం'. నిజానికి వైదేహిగారి కవితలన్నీ ఎప్పటికీ 'పునశ్చరణం' చేసుకోదగినవే. సరికొత్త పదచిత్రాలు, అత్యల్ప పదాలలో లోతైన భావ వ్యక్తీకరణ వైదేహిగారి కవితలని ప్రత్యేకంగా నిలబెడతాయి. ఏ కవితలోని ఏ పంక్తి చదివినా మనసు రసప్లావితమౌతుంది. ఆగి మరొక్కసారి చదివాలనిపిస్తుంది. '(రైలు) పెట్టెలో చిట్లిన పాట', ' మేఘాల చెక్కిళ్ళు', 'కలల దీపాలు',' జ్ఞాపకాల వలలు',' స్వప్నాల సరిహద్దులు', ' ఎర్రగన్నేరు పువ్వుల్లాంటి రోజులు' , ' పంచరంగుల పాళీలు' ,'ఉత్సాహపు తోరణాలు' ,'నక్షత్రాల మేలి ముసుగులు' ,' అలోచనల జలపాతాలు' .. అడుగడుగునా తారసపడుతుంటే వైదేహిగారి కవిత్వాన్ని  ఆస్వాదిస్తూ, పలవరించకుండా ఉండడం అసాధ్యం..!  (సంగీత) కచేరీ, ఎండ, రైలు పెట్టెలో అడుక్కునే అంధుడు, పాతఫోటో, బెడ టైమ్ కథలు.. ఎంచుకున్న కవితా వస్తువు ఏదైనా ప్రతి కవితనీ శిల్పంలా చెక్కడం ఈ రచయిత్రికున్న ప్రత్యేకమైన నేర్పు. ప్రతి కవితా చాలా సులువుగా, సరళంగా, అలవోకగా వ్రాసేసినట్లు అనిపిస్తుంది.  ఆ కవితాశైలి వెన్నెల వానంత సుందరంగా, తేనె వాగంత మధురంగా  ఆకట్టుకుంటుంది. సంగీత కచేరీలో పాటకీ పాటకీ మధ్యనున్న విరామం 'కంపిస్తున్న వాద్యమై /  ఆ సంగీత సామ్రాజ్ఞి ముందు మునివేళ్ళమీద / వినమ్రంగా నిలబడుతుంది' ఎంతచక్కటి పరిశీలన, ఎంత అద్భుతమైన వ్యక్తీకరణ!! నాయనమ్మని 'మరిచిపోయే జ్ఞాపకంగా' కాక 'తేనెలు చిందించిన బంగారు బాల్యంగా' గుర్తుంచుకోవడం ఎంత మందికి చేతనౌతుంది.! సాయంకాలం ఇంటికి చేరుకునే సన్నివేశాన్ని ' మెల్లగా కదులుతున్న కార్ల హారాలలో / నేనూ ఓ పగడపు పూసనై చిక్కుకున్నా / పొద్దు ఎర్రతామరలా ముకుళించేలోపు / నా చిన్నారి తల్లులని చిరుగాలిలా చేరుకుంటాను' అనడం లోని సున్నితత్వం వైదేహిగారి కవితలకే చెల్లింది. ఇందులోని ప్రతి కవితా మంచికవితకి చక్కటి ఉదాహరణగా పేర్కొనవచ్చు. రచయిత్రి కలం నుంచి ఇలాంటి కవితలు నిరంతరం ప్రవహిస్తూ ఉండాలని  ఆశిద్దాం.

★★★

- - - -




**Writer:**
Dr. Uma Eyyunni
ueyyunni@gmail.com
**Published by:**
Vanguri Foundation of America
vangurifoudnation@gmail.com

**వృత్తిరీత్యా వైద్యురాలు,** ప్రవృత్తి రీత్యా చక్కటి రచయిత్రి ఐనా డా.ఉమ ఇయ్యుణ్ణిగారు వ్రాసిన విలక్షణమైన నవల ఈ 'ఒక అమ్మ ఆక్రోశం'. ఇలాంటి కథాంశాలతో సాధికారికంగా నవల వ్రాయడం వైద్యులకు మాత్రమే సాధ్యమౌతుంది. వైద్యులు ఎన్నో రుగ్మతలకి వైద్యం అందిస్తూ ఉంటారు. శారీరక రుగ్మతలున్న మనుష్యుల బాధలు ఒక రకం ఐతే మానసిక రుగ్మతలున్న వ్యక్తుల బాధలు ఇంకోరకం. మానసిక రోగగ్రస్తులని అర్థం చేసుకోవడం, వారి పట్ల సానుభూతితో ప్రవర్తించడం చాలా అవసరం. ఐతే నిజానికి ఎంత అభివృద్ధిచెందిన సమాజంలోనైనా మానసిక సమస్యలతో బాధపడే వ్యక్తుల పట్ల సరైన దృక్పథం లేకపోవడం శోచనీయం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ రచయిత్రి అంటారు 'సాంకేతికంగా , వైజ్ఞానికంగాను కూడా ఎంతో అభివృద్ధిచెందిన సమాజంలో కూడా మానసిక వ్యాధుల గురించి సరైన అవగాహన లేకపోవడం శోచనీయమైన వాస్తవం... మానసిక వ్యాధులున్న వారి కుటుంబాల ఆవేదన, సంఘర్షణ, ఆర్థిక, సామాజిక సమస్యల గురించి అనుభవించేవారికి తప్ప, కుటుంబసభ్యులకు కూడ పూర్తిగా అర్థం కాకపోవడమనేది విషాదకరమైన విషయం.'

ఈ నవలలో ప్రధాన పాత్రలు రేవతి రవి. వారి ఇద్దరు అబ్బాయిలు రఘు, మధు. ఏ మాత్రం ఆర్థికపరమైన ఇబ్బందులు లేని జీవితం. సమాజంలో ఉన్నతవర్గానికి చెందిన వ్యక్తులు. హాయిగా, ఆనందంగా సాగిపోవాల్సిన వారి జీవితాల్లో పెద్దకుదుపు - పెద్దబ్బాయి రఘుకి 'స్కిజోఫ్రేనియా' అనే మానసిక వ్యాధి ఉంది అని తెలియడం. అలాంటి వ్యకులు చూడడానికి మామూలుగానే ఉంటారు, కానీ ప్రవర్తనలో విపరీతమైన లక్షణాలు కనిపిస్తాయి. ఆ వ్యాధి పట్ల సరైన అవగాహన ఉంటే తప్ప వారి ప్రవర్తనని సానుభూతితో అర్థం చేసుకోవడం చాలా కష్టం. అటువంటి మానసిక వ్యాధికిలోనైన రఘు వల్ల వారి జీవితాల్లో కలిగిన కల్లోలం ఈ నవలలోని ఇతి వృత్తం. ఇదే ప్రధానాంశంగా ఉమగారు 2004లో 'I Want My Son Back – A Mother's Cry' ఆంగ్లంలో ప్రచురించిన నవల ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది అటు మామూలు పాఠకుల, సాహిత్య విమర్శకులతో పాటు మానసిక వైద్యబృందాల మన్ననలు పొందింది. అదే ఇతి వృత్తంతో డా.ఉమగారు వ్రాసిన తెలుగు నవల ఈ 'ఓ అమ్మ ఆక్రోశం'. ఈ నవల చదవడం పూర్తయ్యాక చాలా తక్కువమందికి తెలిసిన - కొన్ని జీవితాల్లోని కోణాల పట్ల ఒక అవగాహన కలుగుతుంది. వివిధ వ్యక్తులని వివిధ కోణాల్లో చూడాల్సిన అవసరం ఉందన్న విషయం అవగతమౌతుంది. ప్రయోజనాత్మకమైన సాహిత్య ప్రయోగం చేసిన రచయిత్రి అభినందనీయురాలు.

★★★



# పుస్తక పరిచయం




**2013 సంవత్సరానికి** కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు పొందిన గ్రంథం ఇది. స్త్రీ సమస్యల గురించి, స్త్రీ సాహిత్యం గురించి విస్తృతమైన అధ్యయనం చేసిన రచయిత్రిగా కాత్యాయనీ విద్మహేగారు తెలుగు సాహితీలోకానికి చిరపరిచితులే. కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు కొంతమంది కలిసి 1982లో స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థగా ఏర్పడడంలో కాత్యాయనీ విద్మహేగారు చురుకైన పాత్ర వహించారు. అప్పటినుంచి సామాజిక సాంస్కృతిక రంగాలలో స్త్రీల సమస్యలపై స్పందిస్తూ ఒక సముదాయంగా పనిచేస్తూ సాహిత్యంలో స్త్రీ హోదా స్థితిగతుల గురించి ప్రత్యేక పరిశోధనలు సాగించాల్సిన అవసరాన్ని పదిమంది దృష్టికి తీసుకొచ్చారు. వివిధ సందర్భాలలో కాత్యాయనీ విద్మహేగారు చదివిన ప్రసంగపాఠాలు, సమీక్షల కలయికగా ఈ సంపుటి రూపుదిద్దుకుంది. శతాబ్దంగా స్త్రీలు సృష్టించిన సాహిత్యాన్ని, స్త్రీల గురించిన సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన పద్ధతీ, దానిలోని పరిణామాలు నాలుగు వ్యాసాల రూపంలో ఈ పుస్తకంలోని మొదటి అధ్యాయంలో ఉన్నాయి. ఈ కోణంలో ఇంత సమగ్రంగా వచ్చిన అధ్యయన వ్యాసాల్లో వీటిని ముందువరుసలో చూడవచ్చు. స్త్రీల కవిత్వం గురించి, స్త్రీల కథల గురించిన వ్రాసిన వ్యాసాలు మరో రెండు అధ్యాయాలుగా రూపుదిద్దికున్నాయి. చారిత్రక అధ్యయనం దృష్టితోనూ, విశ్లేషణా దృష్టితోనే కాక మామూలు పాఠకులుగా చదివినా ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి ఈ వ్యాస సంపుటిలోని విశేషాలు. శతాబ్దం నుంచీ ఆధునిక కాలంవరకూ వచ్చిన స్త్రీల కవిత్వం, కథల విశ్లేషణ ఎన్నో కొత్త విషయాలని తెలియచేయడమే కాక కొత్త ఆలోచనలకి బీజం వేస్తుంది. ఈ పుస్తకానికి ముందుమాట వ్రాసిన డా.నళినిగారు, ముదునూరి భారతిగారు అత్యంత సమగ్రంగా ఈ వ్యాస సంపుటియొక్క ప్రధానాంశాన్ని పరిచయం చేశారు. కాత్యాయనిగారు చేసిన ఈ కృషిని ప్రశంసిస్తూ ముదునూరి భారతిగారు ఇలా అన్నారు - "ఇది కాత్యాయని గత పాతిక సంవత్సరాలుగా చేసిన శ్రమకి ఒక రూపం, ఒక ప్రతిఫలం. విశ్వవిద్యాలయం విద్యార్థులకు, సాహిత్య విమర్శకులకు, సాహిత్యవేత్తలకు కూడా ఉపయోగపడే ఒక అమూల్యమైన కానుకగా దీని ప్రాముఖ్యాన్ని గుర్తించవచ్చును". ఈ పుస్తకం చదివిన ప్రతివారు ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. కేంద్రసాహిత్య ఎకడెమీ వారి అవార్డు ఈ పుస్తకం మరింతమందిని చేరడంలో ఎంతైనా ఉపకరిస్తుంది.

***

*Writer:*
Katyayani Vidmahe
5-11-667 Pasyanthi
Kakatiya University Road, Vidyaranyapuri
Warangal – 506 009

*Avialable at:*
VisaNavodaya Book House




మూడున్నర దశాబ్దాలు పైగా అసలు సిసలైన కవిత్వాన్ని శ్వాసిస్తూ, మినీ కవితోద్యమ సారధిగా తెలుగు కవితా ప్రియులకు చిరపరిచితమైన కవి రావి రంగారావుగారు. కవితారచన ఆయన నిత్యజీవితంలో విడదీయరాని భాగమైతే, కవితలు వ్రాయించడం ఆయనకది ఓ నిరంతర ఉద్యమం. కవితలు వ్రాయడం అనేది ఏ కొందరికో పరిమితమైన ప్రక్రియకాదనీ, కొంచెం కృషిచేస్తూ ఎవరైన మంచి కవితలు వ్రాయొచ్చనీ అభ్యాసాత్మకంగా నిరూపించిన విలక్షమైన కవితా బోధకుడు రావి రంగారావుగారు. 20 పైగా కవితా సంపుటులు, విమర్శనా గ్రంధాలు, వ్యాసాలు ప్రచురించిన రావి రంగారావుగారి కవితా సంపుటి ఈ 'కుంకుడు కాయ'. శబ్దం, అందం, అలంకారం. శైలి.. వీటికంటే కవితలోని అర్థానికి, ప్రయోజనానికీ పెద్దపీట వేస్తూ వ్రాసిన కవితలివన్నీ. తీసుకున్న వస్తువు ఏదైనా అందులోని జీవన సత్యాలకు ఫోకస్ లైట్లు వేయడం ఈ కవితల ప్రత్యేకత. ఇందులోని ఏ కవిత చదివినా ఆలోచనలు పదునెక్కుతాయి. అసలు కవిత్వం అంటే ఏమిటి? - '*కవిత్వం అంటే వర్తమాన ప్రాణం / కవిత్వం అంటే భవిష్య ప్రయాణం / కాలం కంటే ముందు నిన్ను నడిపించే / కాలాతీత మహాశక్తి కవిత్వం*'. కేవలం నిర్వచనానికే పరిమితం కాకుండ ఇందులోని ప్రతి కవితనీ తన నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చి దిద్దారు రావి రాంగారావుగారు. '*మాటలు మరిచిపోయిన సందర్భాల్లోంచే / మారణాయుధాలు ప్రాణం పోసుకుంటాయి/ మాటల్ని బయటికి తీసి పంచుకుంటే / పైరగాలులు పసిపిల్లలై ఆడుకుంటాయి*', '*రేయింబవళ్ళు నెత్తురు చెమటతో / నా చీకటి మట్టిమీద / పచ్చని జీవితం / నా కోసం పండిస్తున్నావు ( శ్రీమతి గురించి)*', '*మనుషులు కరిగి / కురవటం మొదలుపెడితే / మేఘాలెందుకు పనికొస్తాయి..!*' - ప్రతి కవితా ఓ కొత్త పాఠాన్ని చెబుతుంది, కొత్త కోణాన్ని చూపిస్తుంది. ఇందులోని అధికశాతం కవితా పంక్తులు 'కోటబుల్ కోట్స్' లా పదే పదే గుర్తుచేసుకునేలా ఉన్నాయి. ఇవి ఒకసారి చదివి మరిచిపోయే కవితలు కాదు, మళ్ళీ మళ్ళీ చదివి జీవనసారాన్ని నెమరేసుకోవాలనిపించే కవితలు.!

★★★★

**Writer:**
Raavirangarao@gmail.com
raavirangarao.blogsopt.in

Cell#: 92475 81825



# పుస్తక పరిచయం




***Writer:***
Yandamoori Veerendranath
36 UBI Colony
Road# 3, Banjara Hills
HYDERABAD – 500 034
Ph: 924 650 2662

*Publishers:*
Navasahiti Book House
Eluru Road, Near Ramamandiram
VIJAYAWADA – 520 002

**ప్రపంచంలో** మనకి కనిపించే వ్యక్తుల్లో ప్రణాళికా బద్ధంగా జీవితాన్ని తీర్చి దిద్దుకుంటూ శిఖరాలని ఎక్కేవాళ్ళు కొంతమందైతే, వివిధ పరిమితులవల్ల ముందడుగు వెయ్యలేక లోయల్లోనే మిగిలిపోయే వాళ్ళు కొంతమంది. జీవితంలో కొన్నికొన్ని సూత్రాలని పాటించి, ఆలోచనలని పదునుపెట్టుకుని, వ్యక్తిత్వాన్ని మెరుగు పరుచుకుంటూ ముందుకి సాగితే లోయనుంచి శిఖరానికి చేరుకునే అవకాశాలు అధికమౌతాయి. నిరాశలో కూరుకుపోయిన వాళ్ళకి, ఎటువైపు ఎలా ప్రయాణించాలో తెలీని వాళ్ళకి విజయసూత్రాలు ఎవరు చెబుతారు? 'మనిషి దీపమన్నా కావాలి. అద్దమైనా కావాలి. ఒకటి వెలుగునిస్తుంది. మరొకటి దాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతివారూ దీపం కాలేకపోవచ్చు కానీ అద్దం కాగలరు. తనకు తెలిసిన జ్ఞానాన్ని మరొకరికి పంచడమే జీవితం' అని నమ్మిన వీరేంద్రనాథ్‌గారు ఈ 'లోయనుంచి శిఖరానికి' పుస్తకంలో మన జీవితంలోని అనేకానేక కోణాలమీద ఫోకస్ చేశారు. 'ఇంతకుముందే కొన్ని వ్యక్తిత్వ వికాస గ్రంథాలు వ్రాసిన వీరేంద్రనాథ్‌గారు ఇంకా కొత్తగా ఏమి చెబుతారు' అని ఎవరికైనా సందేహం వస్తే అందుకు సమాధానం ఈ పుస్తకంలోని ప్రతి అధ్యాయమూ, ప్రతి వాక్యమూ కూడా. శిఖరమంటే ఏమిటో లోయ అంటే ఏమిటో వివరించాక మనిషిలోని కొన్ని బలహీనతల్ని చర్చించి, వాటిని అధిగమించే ప్రాక్టికల్ మార్గాలని సోదాహరణంగా వివరించారు, శిఖరాన్ని అధిరోహించడానికి బలహీనతల్ని అధిగమించడం ఒక మెట్టు ఐతే బలాలని సమీకరించుకోవడం తరువాతి మెట్టు. ఆ విధానాలని ఒక అధ్యాయంలో వివరించారు. నాయకత్వ లక్షణాల గురించి, జ్ఞానం తర్కం గురించి కూడా చివరి అధ్యాయాల్లో విశ్లేషించారు. మిగతా రచయితల వ్యక్తిత్వ వికాస గ్రంథాలకి దీనికీ వ్యత్యాసం ఎక్కడుందంటే – ఈ పుస్తకంలో వీరేంద్రనాథ్‌గారి స్వానుభవాలు, వాటి అన్వయాలు, విశ్లేషణలూ అడుగడుగునా కనిపిస్తాయి. అవే పాఠకులని ఆత్యంత ఆసక్తికరంగా చివరికంటా చదివిస్తాయి. ముఖ్యమైన సలహాలని, సూచనలని అంశాల వారీగా బులెట్ పాయింట్లలా ఇవ్వడం వల్ల అంతవరకూ జరిగిన చర్చల సారాంశం పాఠకుల మెదడులో ముద్రించుకుపోతుంది. పుస్తకం తెరిచాక పూర్తయే వరకూ పాఠకులు ఇంకే పనీ చెయ్యలేరు. సందర్భానుసారం జతచేసిన కథలూ, సుభాషితాలు, చారిత్రక విశేషాలు, కార్టూన్లు, చార్టులూ .. ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణలు. వీరేంద్రనాథ్‌గారి అత్యంత పాపులర్ నవలకు మించిన అమ్మకాలని ఈ పుస్తకం మొదటి వారంలోనే సాధించందంటే ఈ పుస్తకం సత్తా ఏమిటో పాఠకులు అర్థం చేసుకోవచ్చు. ఇందులోనికొన్ని భాగాలు మన 'కౌముది'లో ప్రచురితమైన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ఎంతో పరిశోధించి, సమస్యలని అన్నికోణాలనుంచి విశ్లేషించి వీరేంద్రనాథ్‌గారు వ్రాసిన ఈ పుస్తకం అన్ని వయసులవారికీ నమ్మదగిన స్నేహితుడులాంటిది. ***




**Writer:**
Shamshad Mohammed
48993 Oat Grass Terrace
FREMONT, CA – 94539

**కవయిత్రి** షంషాద్‌గారిని తెలుగు కవితా ప్రపంచంలో ఎంతమంది గుర్తించారో తెలీదు కానీ, ఈ కవితా సంపుటి చదివిన ప్రతి వారూ ‘ఈ కవయిత్రి ఇంతకాలం ఎక్కడున్నారు?‘ అని ఆశ్చర్యపోక తప్పదు. ‘ఈ కిటికీ తెరుచుకునేది ఊహల్లోకే‘ అనేది ఈ సంపుటికి శీర్షిక. నిజానికి ఈ సంపుటిలోని ప్రతి కవితా ఓ సరికొత్తలోకంలోకి కిటికీలు తెరుస్తుంది. ఈ కవితల్లో ధ్వనించేవి ఊహలు కాదు, భయంకరమైన వాస్తవాలు - ఈ కవితల్లో కనిపించేవి కలల అలలు కాదు - కొన్ని జీవితాల్లో మరుగునపడిన కోణాలు. ఇందులోని ఏ కవితా ఊహల్లోంచి ఊడి పడలేదు. ప్రతి కవితలోని ప్రతి పంక్తీ రచయిత్రి వేదనాభరిత హృదయంలోంచి సూటిగా దుసుకొచ్చింది. పదునెక్కిన ఆలోచనల్లోంచి వాడిగా వేడిగా వెలువడిన తూణీరాలు ఈ కవితలన్నీ. కేవలం వస్తువైవిధ్యమే కాదు, రచనా శైలిలో కూడా రచయిత్రి తనదైన సొంత మార్గాన్ని ఏర్పరుచుకున్నారు. ‘నీ జీవితపు స్టూడియోలోంచి / బయటికి రాలేకపోయినా / నా హృదయపు డార్క్‌రూమ్ లో / నువ్వెప్పుడూ నెగిటివ్‌వే‘. మనసుపొరల్లోని ద్వేషాన్ని ఇంత వినూత్నంగా, గాఢంగా చెప్పడం షంషాద్‌గారి సొంత సంతకం. ఆడపిల్లల కష్టాలగురించి ఎన్ని కవితలు వచ్చినా షంషాద్ గారు ‘మానని గాయాలు / మరెప్పుడూ మరెవ్వరికీ తగలకుండా / మందేదైనా ఇవ్వమ్మా/ ఆడజాతంతా మింగేస్తాం / పుట్టే ప్రతి ఆడపిల్లకీ పురిట్లోనే వేసేద్దాం / మర్చిపోకమ్మా/ మందు జీవితకాలం పనిచేయాలి‘ చివరి పంక్తి దగ్గరకి వచ్చేసరికి మనసు తడి కాకమానదు. ‘చాంద్‌నీమే అంధేరా‘ అనే కవితలో ముస్లిం వనితల మూగ బాధలని అద్దంలో చూపించారు. ఈ కవిత చదువుతుంటే ఆయా జీవితాల్లోని బాధలు కళ్ళముందు ప్రత్యక్షమౌతాయి. మధ్యమధ్యలో ‘నీడ‘, ‘ఉదయించే నా రాత్రి‘, ‘సమాంతర రేఖలు‘ లాంటి కవితల్లో సున్నితమైన మనసు పలికే భావాల ప్రతిబింబాలూ ఉన్నాయి. ‘కాలం ఆగని ప్రవాహమే / జీవితం ఓ చోట ఆగిపోతుంది/ మరోచోట మొలకెత్తుంది‘ అని ‘జిందగీ‘కి అన్వయం చెప్పారు ఓ కవితలో. నిశితమైన ఆలోచనలు, గాఢమైన భావాలు పునాదిగా కవితలు వ్రాస్తున్న షంషాద్‌గారి కలం నుంచి మరిన్ని మంచి కవితలు రావాలని ఆశిద్దాం. ***

# పుస్తక పరిచయం




***Publishers:***
**Emesco Books**
1-2-7, Bhanu Colony
Gaganmahal Road, Domalguda
HYDERABAD - 500 029
Phone: 040-23264028

***Distributed by:***
**Sahiti Publications**
Vijayawada

**భారతదేశ** రాజకీయ ఘట్టాలు చిత్రవిచిత్రంగా ఉంటాయి. చాలా సందర్భాల్లో ఒక పార్టీ గెలుపుకి, మరో పార్టీ మీద ఉన్న వ్యతిరేకత మూలకారణం అవుతూ ఉంటుంది. చాలా కొద్దిసార్లు మాత్రమే నిజంగా ఒక పార్టీనో, వ్యక్తినో పూర్తి నమ్మకంతో ఎన్నుకోవడం జరుగుతుంది. అలా ఎంపికైన వ్యక్తే ప్రస్తుత భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ. వంశపారంపర్య అధికారాన్ని మట్టికరిపించి భారతదేశ ప్రజాస్వామ్యం ఎంత బలమైందో తెలియచేశారు మోడీ. అతి సాధారణమైన నేపథ్యంతో ఎదిగిన వ్యక్తి సైతం దేశప్రధాని కాగలడని నిరూపించారు మోడీ. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులనుంచి ఆయన జీవితం తెరిచిన పుస్తకమే కానీ అంతకుముందు జరిగిన ఆయన జీవనప్రయాణం గురించి చాలా తక్కువమందికి తెలుసు. ఈ నేపథ్యంలో వచ్చిన 'నరేంద్రమోడీ - ఒక పరిచయం' పుస్తకం ఆయన గురించి సమగ్రంగా తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగిస్తుంది. రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు బహుగ్రంథ రచయిత. తెలుగు-హిందీ సాహిత్యాలకు వారధిగా నిలిచిన యార్లగడ్డగారి కలంనుంచీ వెలువడిన ఈ పుస్తకం రచనా శైలి అతి సరళంగా ఉంది. ఎక్కడా ఒక్క అనవసరమైన వాక్యంకానీ, సందర్భాలు కానీ ఈ పుస్తకంలో చోటుచేసుకోలేదు. పుస్తకం మొదలుపెట్టగానే ఆసక్తికరంగా చదివిస్తుంది. అలాగే ఇదేదో వార్తాపత్రిక రిపోర్టు అనిపించకుండా కాల్పనిక నవలలు ఎలా ఉంటాయో అంత బిగువుతో ఈ పుస్తక రచన కొనసాగింది. మధ్యమధ్యలో రచయిత చేసిన విశ్లేషణలు, వ్యాఖ్యానాలు ఈ పుస్తకానికి అదనపు విలువని ఆపాదించాయి. ఉదా: "నాయకుడు కావడం అంటే అంత సులభం కాదు. జీవితంలో సంఘర్షించాలి. ఆటుపోట్లను ఎదుర్కోవాలి. పలాయనం చిత్తగించకూడదు. ఆమోదయోగ్యత సంపాదించేందుకు కృషిచేస్తూనే, నిర్ణయాలు తీసుకున్న తర్వాత వెనుకడుగు వెయ్యకూడదు". చాలా మందికి తెలియని మోడీగారి బాల్యం నుంచీ మొదలుపెట్టి అందరికీ తెలిసిన ప్రధానమంత్రి ప్రమాణస్వీకారం వరకూ జరిగిన ఘట్టాలని అత్యంత ఆసక్తికరంగా పొందుపరిచారీ పుస్తకంలో. రచయిత కూడా క్రియాశీలక రాజకీయాలతో పరిచయం ఉన్న వ్యక్తీ, నరేంద్రమోడీ జీవనప్రయాణంలో ఎదురైన అనేకమంది రాజకీయనాయకులతో సన్నిహిత పరిచయం ఉన్న వ్యక్తీ కావడం వల్ల ఈ పుస్తకానికి సాధికారత లభించింది. నరేంద్రమోడీ నడిచొచ్చిన దారులకి అక్షరరూపం , నిలువుటద్దం -యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు వ్రాసిన ఈ 'నరేంద్రమోడీ - ఒక పరిచయం'.




**Writer:**
**Akella Raghavendra**
6-84, Bhavani Nagar
Dilsukhnagar, HYDERABAD – 60
Cell#: +91 98493 11109
akellaraghavendra@yahoo.com
Arfoundation1089@gmail.com

***'జీవితమెంతో తీయనిది.. అందుకనే అతిస్వల్పమది..'*** అన్నాడో సినీకవి. సుదీర్ఘమైన జీవితాలూ ఉంటాయి, అత్యల్పమైన జీవితాలూ ఉంటాయి. ఎన్నిసంవత్సరాల జీవనం అనేకంటే జీవితకాలంలో సాధించినదెంత అనేది సార్థకతకి కొలమానం. చరిత్రపుటలు తిరగేస్తే అద్భుతమైన విజయాలు సాధించిన అల్పాయుష్కులెందరో కనిపిస్తారు. చెరగని ముద్రలు వదిలి వెళ్ళిన అలాంటి రాలినమొగ్గల గురించిన స్ఫూర్తిదాయకమైన కథనాల సంకలనం ఈ పుస్తకం. రచయిత ఆకెళ్ళ రాఘవేంద్రగారు. ఆంధ్రదేశంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకులు, ఐ.ఎ.ఎస్ పరీక్షలు వ్రాసే విద్యార్థులకి తెలుగు పాఠ్యాంశాన్ని బోధిస్తున్నారు. ఈ పుస్తకానికి ముందు మాటలో రచయిత ఇలా అంటారు " చిరకాలం పొగచూరులో బతకడం కన్న - ఒకే ఒక్క క్షణం - వేలాది కిరణాల సూర్యుడిలా వెలగడం మిన్న. ఎన్నేళ్ళు బతికామన్నది కాదు. ఎందుకు బతికామన్నది ప్రధానం. ఈ పుస్తకంలోని మహనీయులంతా అతి తక్కువకాలం జీవించినవారే! అయితేనేం - జనన్నాని సఫలం చేసుకొన్నారు. కొందరు ఎలా బతకాలో చెబుతారు. కొందరు ఎలా బతకకూడదో చెబుతారు..". లేతవయసులో రాలిన అలాంటి మొగ్గలు 50 మంది పైగా కథనాలని  కళ్ళముందు నిలబెట్టారు రచయిత రాఘవేంద్రగారు. వీరిలో భారతదేశానికి చెందిన వారేకాక ఇతర ప్రపంచదేశాలకి చెందిన వారు కూడా ఉన్నారు. వీరిలో అందరికీ తెలిసిన స్వామి వివేకానంద, ఝాన్సీ లక్ష్మీబాయి, ఆది శంకరుల లాంటివారే కాక అతి తక్కువమందికి తెలిసిన రోషన్ సింగ్, కావలి వెంకట బొర్రయ్య లాంటి వారు ఉన్నారు. బ్రూస్ లీ, యూరీ గగారిన్, మార్టిన్ లూథర్ కింగ్ లాంటి వారి జీవితాలూ స్ఫూర్తిదాయకంగా ఉత్తేజపరుస్తాయి. ప్రతి వారి గురించి వ్రాసేప్పుడు వారి జీవితాల్లోని ముఖ్యాంశాలని బాక్స్ ఐటమ్స్‌గా వ్రాయడం ఆయా కథనాలకి అదనపు ఆకర్షణ కలిగిస్తోంది. పుస్తకం చదవడం పూర్తయే సరికి మనసు బరువెక్కడమే కాదు, జీవితం విలువ ఏమిటో తెలుస్తుంది. ఆలోచించడం అలవాటున్న ప్రతివారూ చదవాల్సిన అమూల్యమైన పుస్తకం ఈ 'చెరగని ముద్రలు'. తెలుగుసాహిత్యంలో ఇలాంటి విశిష్టమైన పుస్తకాన్ని తొలిసారిగా ప్రచురించిన రాఘవేంద్రగారిని ఖచ్చితంగా అభినందించి తీరాలి.

****

# పుస్తక పరిచయం




***Writer:***
**PSM Lakshmi**
B – 391 Srikrishna Nagar
HYDERABAD - 500 045
Phone: 9866001629

***Distributed by:***
Visalandhra Publishing House
Navodaya Book House
Sahityabharati Book Shop
Kinige.com

**ఆంధ్రదేశంలోని** ప్రతి ఊరిలోనూ కనీసం ఒకటైనా దేవాలయం ఉంటుంది. పట్టణాల్లో, నగరాల్లో ఐతే డజన్ల కొద్దీ దేవాలయాలు ఉన్నాయి. వీటిల్లో అధికశాతం కొన్ని శతాబ్దాల పూర్వం నిర్మించబడినవే. ప్రతి దేవాలయానికీ ఒక స్థలపురాణం ఉంటుంది. కొన్ని అధికప్రచారంలో ఉన్నా, ఎక్కువశాతం దేవాలయాలకి సంబంధించిన చరిత్రలు ఏ పుస్తకాల్లోనూ ఉండవు. ఆనోటా ఆనోటా ప్రచారంలో నిలుస్తాయంతే. ఏదో దూరప్రాంతాలకి వెళ్ళేప్పుడు ఏ రహదారి పక్కనో, అడవుల్లోనో, కొండగుట్టమీదో ఏదో చిన్న దేవాలయం కనిపిస్తుంది. నమ్మకం ఉన్నవాళ్ళు అక్కడికి వెళ్ళి దణ్ణం పెట్టుకుని వస్తారు. దాని చరిత్ర చెప్పేవాళ్ళు ఎక్కడ ఎవరూ ఉండకపోవచ్చు. ఇలాంటి నేపథ్యంలో రచయిత్రి పి.ఎస్.ఎమ్. లక్ష్మిగారు నల్గొండలోని పుణ్యక్షేత్రాలగురించి, వరంగల్ జిల్లాలోని పుణ్యక్షేత్రాల గురించి లోగడ రెండు పుస్తకాలని వెలువరించారు. ఆ కోవలో మూడవ పుస్తకం ఈ యాత్రాదీపిక. ఇందులో హైదరాబాదు నుంచీ ఒక్క రోజులో వెళ్ళి చూసిరాగల పరిధిలో ఉన్న 72 ఆలయాల గురించిన సమగ్ర సమాచారం ఉంది. ఇలాంటి పుస్తకాల్లో సహజంగా దేవాలయాల గురించిన వివరణ ఉంటుంది కానీ లక్ష్మిగారు వ్రాసిన మిగతా పుస్తకాల లాగానే ఇందులో కూడా ప్రతి ప్రదేశానికి ఎలా వెళ్ళొచ్చో కూడా వివరంగా వ్రాశారు. వెళ్ళే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గమనికలు ప్రతి చిన్న విషయాన్నీ ప్రాక్టికల్‌గా ఉపయోగపడేలా వ్రాశారు. రచనా శైలి సరళంగా, సులభంగా ఎవరో మిత్రులు పక్కన కూర్చుని వివరిస్తున్నట్లుంటుంది. కొన్నికొన్ని దేవాలయాల విషయాల్లో ప్రచారంలో ఉన్న చిన్నచిన్న కథలు కూడా పేర్కొన్నారు. దైవభక్తితో ఈ దేవాలయాలని సందర్శించాలనుకున్న వారికి ఈ పుస్తకం చక్కటి గైడ్‌లా ఉపయోగపడుతుంది. పురాతన వైభవాల దృష్టిలో చూసినా ఇలాంటి ప్రదేశాల సందర్శన ఆసక్తికరంగా ఉంటుంది. చరిత్రలో మరుగున పడిన సంఘటనల గురించి తెలుసుకునే అవకాశం కలిపిస్తుంది. లక్ష్మిగారు చేస్తున్న ఈ యాత్రాదర్శిని ప్రణాళికలు అభినందనీయం. అరుదుగా లభ్యమయ్యే వివరాలని, స్వానుభవాలని అందరికీ ఉపయోగపడే రీతిలో గ్రంథస్తం చేస్తున్న వారి కృషి పదికాలాలు నిలిచిపోతుంది.

***




***Publishers:***
**Bhuvana Vijayam, Melbourne**
PO Box: 1161, Balckburn North
VIC 3130, Australia
melbotelugusahiti@yahoogroups.com

**ఆస్ట్రేలియాలోని** వివిధ నగరాల్లో నివసించే తెలుగువారి రచనల సంకలనం ఈ కవితాస్త్రాలయ-2014. పేరులో కవితాస్త్రం అని ఉన్నా నిజానికి ఈ 300 పేజీల పుస్తకంలో అన్ని సాహిత్యప్రక్రియలూ చోటుచేసుకున్నాయి. అన్నింటికీ అంతర్గత సూత్రం ఆస్ట్రేలియాలో నివసించే తెలుగువారి గుండెచప్పుళ్ళు, వారి కలం కదలికలు. అన్ని విదేశాల్లోలాగానే ఆస్ట్రేలియాలో కూడా చాలా దశాబ్దాలుగా తెలుగువారు నివసిస్తున్నారు. ఆ దేశంలోని అన్ని విభాగాల్లో విశిష్టసేవలందిస్తూ తమ ప్రత్యేకతని నిలబెట్టుకుంటున్నారు. గౌరవాన్ని పొందుతున్నారు. అన్ని రంగాల్లోలాగానే తమ సంస్కృతీ వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ మెల్‌బోర్న్ నగరంలో భువనవిజయం అనే సాహితీ సంస్కృతీ సంవేదికని నిర్వహిస్తున్నారు. దాని సంచాలకులు మల్లికేశ్వరరావు కొంచాడగారి ఆధ్వర్యంలో 2010 లో మొదటిసారిగా 'కవితాస్త్రాలయ' అనే రచనా సంకలనాన్ని ప్రచురించారు. దానికి లభించిన విశేష ఆదరణని పురస్కరించుకుని ఈ సంవత్సరంలో కూడా కవితాస్త్రాలయ-2014 (ఆస్ట్రేలియా సాహితీ సుగంధాలు) అనే ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, కాన్‌బెర్రా, పెర్త్ లాంటి వివిధ నగరాలనుంచి తెలుగు రచయితలు తమ రచనలతో ఈ పుస్తకాన్ని సుసంపన్నం చేశారు. సాహితీ ప్రక్రియని బట్టి కాక అంశాన్ని బట్టి ఇందులోని రచనలని 13 విభాగాలుగా తీర్చిదిద్దారు. ప్రతి అధ్యాయానికీ ప్రముఖ చిత్రకారులు బాలిగారు చక్కటి అధ్యాయ చిత్రాన్ని వేశారు. ఇందులోని కొన్ని విభాగాలు: తెలుగు తల్లికి మల్లెపూదండ , తెలుగు వైభవం, మా తెలుగు పల్లె, మన పండుగలు, కాలవాహిని, సుభాషితాలు.. వగైరా. ప్రతి విభాగంలోనూ కథలూ, కవితలూ, వ్యాసాలూ, విశ్లేషణలూ, నాటికలూ.. ఉన్నాయి. పుస్తకం చివరలో ప్రచురించిన రచయిత(త్రు)ల పరిచయాలు చదువుతుంటే ఒక్కసారి ఆస్ట్రేలియాలో తెలుగువారి విస్తృతి, వైభవం, చరిత్ర తెలుసుకున్నట్లుంటుంది. చక్కటి ముద్రణ, తనికెళ్ళ భరణి లాంటి సాహితీవేత్తల పరిచయవాక్యాలు ఈ పుస్తకాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. ఆస్ట్రేలియా తెలుగు రచయితల ఈ కృషి అక్కడి ముందు తరాలకి మార్గదర్శి కావాలని, వారి నుంచి ఇటువంటి సంకలనాలు మరిన్ని రావాలని ఆశిద్దాం. ***